


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com






హైదరాబాద్ | బుధవారం 21-7-2021 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 289 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## రెండో విడత గొర్రెల పంపిణీకి రూ. 6 వేల కోట్లు : సీఎం కేసీఆర్

హైదరాబాద్ , జులై 20: తెలంగాణలో వృత్తి జీవనం సబ్బండ వర్గాలను అనుసరించే కొనసాగుతున్నదని, కుల వృత్తులన్నీ బీసీ వర్గాలే నిర్వహిస్తున్ననేపథ్యంలో వారిని అన్ని రంగాల్లో ఆదుకోవడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రచించి కార్యాచరణ చేపట్టిందని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. అందులో భాగంగా అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచి తెలంగాణ బీసీ వర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి భవన్‌లో మంత్రులు హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని త్వరలోనే చేపట్టాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, అధికారులను ఆదేశించారు. ఇప్పటికే మొదటి విడత ద్వారా రూ. 5 వేల కోట్లతో గొర్రెల పంపిణీ చేపట్టగా.. అద్భుతమైన ఫలితాలను ఇచ్చిందన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ కోసం రూ. 6 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు సీఎం తెలిపారు. ఈ నిధులను సమకూర్చాలని ఆర్థిక శాఖను కేసీఆర్ ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగిస్తున్న గొర్రెల యూనిట్‌ను అదే సంఖ్యతో కొనసాగించాలని సీఎం స్పష్టం చేశారు. దాంతో పాటు యూనిట్ (20+1) ధరను పెంచాలని సీఎం నిర్ణయించారు.

నాటి సమైక్య పాలనలో ధ్వంసమైన తెలంగాణ కుల వృత్తులను ఒక్కొక్కటిగా తీర్చిదిద్దుతూ, గాడిన పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అవిరామంగా కృషి చేస్తోంది అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఈ క్రమంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమౌతూ, తెలంగాణ సబ్బండ కులాల జీవనంలో గుణాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని కేసీఆర్ తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలమైన కులవృత్తులను మరింతగా ప్రోత్సహిస్తామని సీఎం స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో మళ్లీ మొదలయిన లాక్ డౌన్..

హైదరాబాద్ , జులై 20:తెలంగాణలో కరోనా కేసులు తగ్గుముఖం పట్టాయి..దీంతో ప్రభుత్వం ఆంక్షలను సడలించింది. దీంతో వ్యాపారాలు, మాల్స్, కాంప్లెక్స్‌లు తెరుచుకుంటున్నాయి. అయితే కొందరు మాత్రం ఇప్పటికీ ప్రజలు మాస్కు లు లేకుండా బయటికి రాకూడని అధికారులు చెప్తున్నారు. ఇక మళ్లీ థర్డ్ వేవ్ మొదలుకానుందని నిపుణులు హెచ్చరిస్తుంటడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలోనే మరోసారి రాష్ట్రంలో లాక్‌డౌన్‌లు మొదలయ్యాయి. తాజాగా జగిత్యాల జిల్లాలో లాక్‌డౌన్ మొదలయ్యింది. వెల్గటూర్ మండలం ఎండపల్లిలో గత రెండు రోజుల క్రితం కరోనాతో ఒకరు మృతి చెందడంతో పాటు.. కరోనా కేసుల సంఖ్య 12కు పెరిగింది. దీంతో అప్రమత్తమైన గ్రామ పంచాయితీ మరోసారి లాక్ డౌన్ అమలుచేస్తునట్లు ప్రకటించింది.

ఎండపల్లిలో గ్రామంలో జూలై 19వ తేదీ నుంచి ఆగస్ట్ 1 వరకు పది రోజుల పాటు లాక్డౌన్ విధిస్తూ గ్రామపంచాయతీ తీర్మానం చేసింది. ఉదయం ఏడు గంటల నుంచి 9 గంటల వరకు మాత్రమే దుకాణాలు తెరిచి ఉంచాలని. ఆ తర్వాత మూసేయాలంటూ తీర్మానంలో పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన దుకాణ యజమానులకు 5 వేల రూపాయల జరిమాన విధిస్తామని తెలిపారు. అలాగే గుంపులుగా తిరిగినా, మాస్క్ ధరించకపోయినా వెయ్యి రూపాయల జరిమానా విధించాలని నిర్ణయించారు. ఏఎన్‌ఎంలకు కరోనా రోగుల సమాచారం అందించిన తర్వాతే..ఆర్‌ఎంపీలు వైద్యం చేయాలని తీర్మానించారు. సామాజిక దూరం పాటించాలని.. గుంపులుగా తిరగొద్దని.. మాస్క్ ధరించాలంటూ అవగాహన కల్పించేలా గ్రామంలో వాల్ పోస్టర్స్ అతికించారు.

## బోనాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు : మంత్రి తలసాని



హైదరాబాద్ , జులై 20:ఆషాడ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఉత్సవాల నిర్వహణ కోసం వివిధ ఆలయాలకు ఆర్థికసాయంగా ప్రభుత్వం రూ.15 కోట్ల విడుదల చేసిందని ఆయన వెల్లడించారు.

మంగళవారం సికింద్రాబాద్‌లోని శ్రీఉజ్జయిని మహంకాళి ఆలయం ఆవరణలో రాంగోపాల్‌పేట, మొండా మార్కెట్ డివిజన్‌లకు చెందిన వివిధ ఆలయాల కమిటీ సభ్యులకు ఆర్థికసాయం చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ? ప్రజలంతా కొవిడ్ నిబంధనలు పాటిస్తూ బోనాల ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ, మహంకాళి ఆలయ ఈఓ మనోహర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు అత్తిలి అరుణ గౌడ్, ఆకుల రూప, వివిధ దేవాలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 'కొవాగ్జిన్' అనుమతిపై సమీక్షిస్తున్నాం : డబ్ల్యుహెచ్ఓ

న్యూఢిల్లీ, జులై 20:భారత్ బయోటెక్ తయారు చేసిన కొవాగ్జిన్ టీకాకు అత్యవసర వినియోగ జాబితా (ఎమర్జెన్సీ యూజ్ లిస్టింగ్ ? ఈయూఎల్?) గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (చిఉూ) ప్రకటించింది. ఇప్పటికే భారత్ బయోటెక్ సంస్థ ప్రతినిధులతో సమావేశం పూర్తయిందని పేర్కొంది. కంపెనీ సమర్పించిన డేటాను సాంకేతిక నిపుణుల కమిటీ విశ్లేషిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆగ్నేయ ఆసియా ప్రాంతీయ డైరెక్టర్ పూనమ్ ఖేత్రపాల్ సింగ్ పేర్కొన్నారు. కంపెనీ సమర్పించిన సమగ్ర సమాచారాన్ని విశ్లేషిస్తున్నట్లు డబ్ల్యూహెచ్ఓ ఆగ్నేయాసియా ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ పూనమ్ ఖేత్రపాల్ సింగ్ వెల్లడించారు.

ఇప్పటి వరకు ఫైజర్, ఆస్ట్రాజెనెకా, మోడెర్నా, జాన్సన్ అండ్ జాన్స్, సినోవాక్, సినోఫార్మ్ టీకాలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎమర్జెన్సీ యూజ్ లిస్టింగ్ కింద గుర్తింపు జారీ చేసినట్లు తెలిపారు. భారత్ బయోటెక్ వ్యాక్జిన్‌కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని భారత్ బయోటెక్ ఈ నెల తొలివారంలో అందజేసిందని, ప్రపంచ ఆరోగ్య సంస్థ నిపుణుల బృందంగా వాటిని పరిశీలిస్తుందని పూనమ్ ఖేత్రపాల్ పేర్కొన్నారు. మరో వైపు డబ్ల్యూహెచ్ నేతృత్వంలో ఏర్పాటైన 'కొవాక్స్' కార్యక్రమం ద్వారా భారత్‌కు 7.5 మిలియన్ మోడెర్నా డోసులు అందించనున్నట్లు పేర్కొన్నారు.

కరోనా డెల్టా వేరియంట్ వంద దేశాల్లో వ్యాప్తి చెందిందని పూనమ్ ఖేత్రపాల్ తెలిపారు. త్వరలోనే ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రాబల్యం కలిగిన వేరియంట్‌గా అవతరించనుందని అన్నారు. డెల్టా చాలా వేగంగా వ్యాప్తి చెందుతుందని, దీంతో పలు దేశాల్లో కొవిడ్ కేసులు, మరణాల సంఖ్య పెరగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు వైరస్ కట్టడి చర్యలు సమర్థంగా చేపట్టాలని ఆగ్నేయాసియా దేశాలకు సూచించారు. కొవిడ్ వ్యాప్తిని అరికట్టేందుకు 'అత్యవసరంగా' పని చేయాని, థర్డ్ వేవ్‌ను ఎదుర్కొనేందుకు ప్రజలకు టీకాలు వేయాలని కోరారు. గత పది వారాలుగా, కొన్ని తూర్పు మధ్యధరా, యూరోపియన్, ఆగ్నేయాసియా దేశాల్లో కరోనా కేసులు నిరంతరం పెరుగుతున్నాయని తెలిపారు. భారత్, నేపాల్, మాల్దీవుల్లో కేసులు తగ్గుతున్నాయని చెప్పారు.

## పెగాసస్ ప్రకంపనలు.. ఉభయసభలు వాయిదా




న్యూఢిల్లీ, జులై 20: పార్లమెంట్ ఉభయసభలు ఇవాళ విపక్ష నినాదాలతో హోరెత్తాయి. పెగాసస్ స్పైవేర్‌పై చర్చ చేపట్టాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. ప్లకార్డులతో వెల్‌లోకి దూసుకువచ్చారు. ఆ సమయంలో స్పీకర్ ఓం బిర్లా వారిని వెనక్కి వెళ్లాలని ఆదేశించారు. ప్రశ్నోత్తరాలు జరుగుతున్న సమయంలో విపక్ష సభ్యులు నినాదాలు ఆపలేదు. దీంతో స్పీకర్ బిర్లా.. విపక్ష సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన రీతిలో నోటీసు ఇవ్వలేదని ఆరోపించారు. ప్రభుత్వం ఆ అంశంపై సోమవారమే ప్రకటన చేసిందన్నారు. అయినా ప్రతిపక్ష సభ్యులు నినాదాలు కొనసాగించారు. అన్ని అంశాలపై సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పీకర్ తెలిపారు. గందరగోళం మధ్య స్పీకర్ సభను మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా వేశారు.రాజ్యసభలోనూ ఇదే సీన్ రిపీటైంది. విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకురావడంతో.. సభను చైర్మన్ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. లోక్‌సభ ఎంపీ అధిర్ రంజన్ చౌదరీ మాట్లాడుతూ.. పెగాసస్ లాంటి ఇంటెలిజెన్స్ సిస్టమ్‌ను ఎప్పుడైనా కాంగ్రెస్ వాడిందా.. ఇలాంటి గూఢచర్యం గురించి తమకు తెలియదన్నారు. న్యూ ఇండియా మేకింగ్‌కు ఇదో స్ట్రాటజీ అని అధిర్ ఆరోపించారు.ప్రభుత్వానికి, పెగాసస్ ఇష్యూకు సంబంధం లేదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. ఒకవేళ ఆ సమస్యను వాళ్లు లేవనెత్తాలనుకుంటే, దాన్ని సరైన రీతిలో ప్రశ్నించాలన్నారు. ఇప్పటికే ఆ అంశంపై మంత్రి సమాధానం ఇచ్చినట్లు జోషీ తెలిపారు.

## ప్రతి ముగ్గురిలో ఒకరికి వైరస్ ముప్పు : ఐసీఎంఆర్ చీఫ్

న్యూఢిల్లీ, జులై 20:దేశంలో ప్రతి ముగ్గురిలో ఒకరికి ఇప్పటికీ కరోనా వైరస్ ముప్పు పొంచిఉందని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ బలరాం భార్గవ మంగళవారం హెచ్చరించారు. ప్రజలంతా విధిగా కొవిడ్-19 నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. దేశ జనాభాలో మూడో వంతు మందిలో యాంటీబాడీలు లేవని, దేశ జనాభాలో 40 కోట్ల మంది ఇప్పటికీ వైరస్ బారినపడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

నాలుగవ జాతీయ సెరో సర్వే వివరాలను ఆయన వెల్లడించారు. జూన్-జులైలో 70 జిల్లాల్లో ఈ సెరో సర్వే చేపట్టారని ఇందులో ఆరు నుంచి 17 సంవత్సరాల లోపు వారినీ చేర్చారని చెప్పారు. దేశ జనాభా అంతటిలో 67.6 శాతం మందిలో యాంటీబాడీలు ఉన్నట్టు వెల్లడైందని అన్నారు. 6-9 ఏండ్ల వయసు వారిలో 57.2 శాతం మందిలో యాంటీబాడీలు ఉండగా, 10-17 ఏండ్ల వయసులో వారిలో 61 శాతం, 18-44 ఏండ్ల వయసువారిలో 66.7, 45-60 ఏండ్ల వయసు వారిలో 77.6 శాతం మందిలో యాంటీబాడీలను గుర్తించారు.

ఇక ఆరోగ్య కార్యకర్తల్లో 85.2 శాతం మందిలో యాంటీబాడీలను గుర్తించారు. దేశ జనాభాలో ఆరేండ్లు పైబడిన వారందరిలో మూడింట రెండు వంతుల జనాభాలో కరోనాను నిరోధించే యాంటీబాడీలున్నట్టు సెరోసర్వేలో వెల్లడైందని బలరాం భార్గవ పేర్కొన్నారు.

## ఏమన్ కీ బాత్'తో కేంద్రానికి రూ.30.80 కోట్ల ఆదాయం

న్యూఢిల్లీ, జులై 20:ఆదరణ కోల్పోతున్న ఆలిండియా రేడియో, దూరదర్శన్‌లపై బీజేపీ సర్కారు ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఇప్పుడు అవి లాభాల బాట పట్టినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ప్రధాని మనసులో మాట కార్యక్రమం 'మన్ కీ బాత్'తో రూ.కోట్ల ఆదాయం వస్తున్నట్లు కేంద్రం తెలిపింది. 2014లో ఆలిండియా రేడియో, దూరదర్శన్‌లలో ప్రధాని మోదీ 'మన్ కీ బాత్'కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి నెల చివరి ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రధాని మోదీ తన మనసుకు నచ్చిన అంశంపై ఈ కార్యక్రమంలో మాట్లాడుతారు.

అలా ఇప్పటివరకు ప్రధాని మోదీ 78 ఎపిసోడ్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంతో ఇప్పటివరకు రూ.30.80 కోట్ల ఆదాయం వచ్చిందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ విషయాన్ని వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో వెల్లడించింది. ఏ సంవత్సరం ఎంత ఆదాయం వచ్చిందో వివరంగా సభకు తెలిపింది. 2014-15లో రూ.1.6 కోట్లు, 2015-16లో రూ.2.81 కోట్లు, 2016-17లో రూ.5.14 కోట్లు, 2017-18లో రూ.10.64 కోట్లు, 2018-19లో రూ.7.47 కోట్లు, 2019-20లో రూ.2.56 కోట్లు, 2020-21లో రూ.1.02 కోట్ల ఆదాయం వచ్చినట్లు పేర్కొంది.

## మొక్కలు నాటిన మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్ , జులై 20:ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా తన పుట్టినరోజు పురస్కరించుకుని తెలంగాణ భవన్ కార్యాలయ ప్రాంగణంలో టీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎంపీ సంతోష్ కుమార్ చేపట్టిన ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటడం ఆనందంగా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ నెల 24 న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పుట్టిన రోజున ముక్కోటి వృక్షార్చన కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## ఈత మొక్కలను నాటిన మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, జులై 20:స్వచ్ఛమైన, ఆరోగ్యమైన నీరాతో పాటు కులవృత్తులను కాపాడాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా 3 కోట్ల 75 లక్షల చెట్లను నాటినట్లు ఎక్సైజ్ శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన భూత్‌పూర్ మండల కేంద్రం సమీపంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. కులవృత్తులతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా తాటి, ఈత, డైమండ్ చెట్లను నాటుతున్నామని తెలిపారు.

ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 3 కోట్ల 75 లక్షల మొక్కలను నాటినట్లు మంత్రి వివరాలను వెల్లడించారు. గతంలో ఇంత పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎవరు చేపట్టలేదన్నారు.

ఇప్పుడు ప్రభుత్వమే కోట్లాది మొక్కలను పెంచుతున్నదని పేర్కొన్నారు. జిల్లాలో కరివేన రిజర్వాయర్ వద్ద 10 ఎకరాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటుతామన్నారు. ప్రతి గ్రామంలో హరితహారం కింద మొక్కలు పెడుతున్నామని, ముఖ్యంగా ఈత మొక్కలను ఒక్క గౌడ కులస్తులే కాకుండా తక్కినవారు కూడా పెట్టేందుకు ముందుకు రావాలన్నారు.

రాష్ట్రంలో అన్ని కులవృత్తులను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు.

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల కాలువ పనులను త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర రెడ్డి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, డిప్యూటీ కమిషనర్ దత్తరాజ్ గౌడ్, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ శేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్ పాల్గొన్నారు.

### చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ ప్రాబల్యము గల విబుధుని
రాబడులను జూచు కానని రసకమ్మైత్మునా
జే బాపురెడ్డి గారిని
జూచి అవలె వెన్నెలలాడు సత్కవి సెంకుటున్!!

( జులై 21 ప్రముఖ కవి, కలెక్టరు జే.బాపురెడ్డి జన్మదినం...)

-రాధశ్రీ
సెల్: 9494481210



నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## దేశ రాజధాని ఢిల్లీలో భారీ ఉగ్రదాడికి అవకాశం: ఇంటెలిజెన్స్

న్యూఢిల్లీ, జులై 20:దేశ రాజధాని ఢిల్లీలో భారీ ఉగ్రదాడి జరగొచ్చని ఆ రాష్ట్ర పోలీసులకు హెచ్చరికలు జారీ అయ్యాయి. డ్రోన్లతో దాడి జరగవచ్చని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15కు ముందే దాడి జరగవచ్చని అలర్ట్ చేశాయి. టెర్రరిస్టులు, సంఘ విద్రోహశక్తులు దాడులకు పాల్పడవచ్చని వివరించాయి. కాగా ఇంటెలిజెన్స్ వర్గాల హెచ్చరికలతో ఢిల్లీ పోలీసులు అలర్ట్ అయ్యారు.కాగా ఇటీవల కశ్మీర్ సరిహద్దుల్లో గుర్తుతెలియని డ్రోన్ల సంచారం అధికమైంది. జమ్మూలోని ఎయిర్ ఫోర్స్ స్థావరం వద్ద డ్రోన్ దాడి తీవ్ర కలకలం రేపింది. దాంతో కేంద్రం సరిహద్దు ప్రాంతాల్లో యాంటీ డ్రోన్ వ్యవస్థలను మోహరించింది.

## రైతుల నుంచి 3000 కోట్లు వెనక్కి తీసుకుంటున్నాం..

న్యూఢిల్లీ, జులై 20: దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు పీఎం కిసాన్ స్కీమ్ కింద నగదు ట్రాన్స్‌ఫర్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే 42 లక్షల మంది అనర్హ రైతులకు కూడా ఆ స్కీమ్ ప్రకారం సుమారు మూడు వేల కోట్లు బదిలీ చేశారు. ఆ అమౌంట్‌ను మళ్లీ వసూల్ చేస్తున్నట్లు ఇవాళ పార్లమెంట్‌లో వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తెలిపారు. పీఎం కిసాన్ స్కీమ్ కింద కేంద్రం ప్రతి రైతుకు ఆరు వేలు ఇస్తున్నది. మూడు ఇన్‌స్టాల్‌మెంట్లలో ఆ అమౌంట్ ఇస్తున్నారు. అయితే ఆదాయ పన్ను కట్టే రైతులకు ఆ స్కీమ్ వర్తించదు. కానీ కొందరు రైతులకు నగదు ట్రాన్స్‌ఫర్ అయ్యింది. వారి నుంచి సుమారు 2992 కోట్లు రికవర్ చేయాల్సి ఉందని మంత్రి తెలిపారు. అస్సాంలో 8.35 లక్షల మంది రైతుల నుంచి 554 కోట్లు వసూల్ చేయాల్సి ఉందన్నారు. పంజాబ్ నుంచి 437 కోట్లు, మహారాష్ట్ర నుంచి 358 కోట్లు, తమిళనాడు నుంచి 340 కోట్లు, యూపీ నుంచి 258 కోట్లు, గుజరాత్ నుంచి 220 కోట్లు వసూల్ చేయాలన్నారు.

## కోవిడ్‌పై చర్చను అడ్డుకున్న వైసీపీ

న్యూఢిల్లీ, జులై 20:ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని ఇవాళ రాజ్యసభలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది.

కోవిడ్19పై చర్చ మొదలైన సమయంలో ఆ పార్టీ సభ్యులు వెల్‌లోకి దూసుకువెళ్లారు. ఏపీ స్పెషల్ స్టాటస్‌పై చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఒక వైపు కోవిడ్‌పై చర్చ జరుగుతుండగా.. వెల్‌లోనే ఉన్న వైసీపీ సభ్యులు నినాదాలు చేస్తూ ఉండిపోయారు. రాజ్యసభ సభాపతి పీయూష్ గోయల్ కూడా వైసీపీ సభ్యుల్ని సీట్ల వద్దకు వెళ్లమని కోరారు. కానీ ఎంపీ విజయ సాయి రెడ్డి మాత్రం వెనక్కి వెళ్లలేదు. ఏపీ ప్రత్యేక హోదాపై వాయిదా తీర్మానం చేపట్టాలని ఎంపీ విజయసాయి డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ప్రత్యేక హోదాపై చర్చ చేపట్టే వరకు వెనక్కి వెళ్లమని ఎంపీ విజయ సాయి అన్నారు. దీంతో డిప్యూటీ చైర్మన్ హరివంశ్ .. సభను కొద్దిసేపు వాయిదా వేశారు.

# కరోనా కారుచీకట్లలో స్టాక్ మార్కెట్ మెరుపులు

ప్రపంచ మానవాళి కరోనా కల్లోల అలల సునామీలో కొట్టుమిట్టాడుతున్నది. జనజీవనం అతలాకుతలం అవుతున్నది. అన్ని రంగాల్లో అస్థిరత్వం రాజ్యమేలుతోంది. ప్రజల జీవనశైలి సమూల మార్పులకు లోనైంది. కుటుంబ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక కార్యకలాపాల్లో ఊహకందని మార్పులు చోటు చేసుకున్నాయి. కరోనా చీకట్లను ఛేదించుకుంటూ ప్రపంచమే ఆశ్చర్యకర పడేలా భారతీయ స్టాక్ మార్కెట్ మాత్రం పరుగులిడుతున్నది. కరోనా అకాలంలో కూడా మార్చి 2020లో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బియస్ఈ) సెన్సెక్స్ 29,468 నుండి జులై 2021లో 53,880కు చేరి 82 శాతం వృద్ధిని రికార్డు చేయడం గమనించాలి. ఈ కోవిడ్-19 మహమ్మారి విజృంభనల నడుమ 2020-21 ఏడాదిలో 14.2 మిలియన్ల కొత్త వ్యక్తులు పెట్టుబడులు పట్టారని తేలింది. సెన్సెక్స్ పెరగడంతో పాటు 69 కంపెనీలు స్టాక్ మార్కెట్ పబ్లిక్ ఇష్యూల (ఐపిఓ) ద్వారా 75,000 కోట్ల పెట్టుబడులు ఆహ్వానించగలిగాయి. ఏప్రిల్-మే-2021 మాసాల్లో పబ్లిక్ ఇష్యూ అనుమతుల కోసం 20 కంపెనీలు సెబి (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా)కి దరాఖాస్తు చేసుకున్నాయి. గతేడాదితో పోల్చితే 2021-22 ఆర్థిక సంవత్సరం రెట్టింపు పెట్టుబడులు ఆకర్శించడానికి అనేక కంపెనీలు ప్రణాళికల తయారీలో ఉన్నాయి.

ఈ ఏడాది దేశంలోనే అతి పెద్ద పబ్లిక్ సెక్టార్ ఇన్సురెన్స్ కంపెనీ యల్ఐసి కూడా 70,000 కోట్ల నిధులు ఆకర్షించనుంది. పేటియమ్ నగదు చెల్లింపుల కంపెనీ కూడా ఐపిఓ ద్వారా 17,000 కోట్ల నిధులు సమకూర్చుకోనున్నది. ఆహార సరఫరా సంస్థ జుమోటో (9,375 కోట్లు), బజాజ్ ఎనర్జీ (5,450 కోట్లు), కెమ్‌ప్లాస్ట్ సన్మార్ (3,500), సామ్హి హోటల్స్ (2,000 కోట్లు), అరోహన్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (1,800 కోట్లు), గ్లెన్మార్క్ (1,800 కోట్లు) హెల్త్ కంపెనీ లాంటి కంపెనీలు ఐపిఓ నిమిత్తం సెబి తలుపులు తడుతున్నాయి. వీటితో పాటుగా ఉత్కర్ష్ బ్యాంక్, పురానిక్ బిల్డర్స్, అపీజే హోటల్స్, ఇసఫ్ బ్యాంక్, శ్రీరామ్ ప్రాపర్టీస్ లాంటి పలు కంపెనీలు పబ్లిక్ ఇష్యూ కోసం అనుమతులు పొందనున్నాయి. కరోనా విపత్తుతో కంపెనీలు నూతన ఆలోచనలకు పదునుపెడుతూ ఖర్చులను తగ్గించడం, వేతనాల కోతలు విధించడం, ఉద్యోగుల సంఖ్యను తగ్గించడం, నూతన నియామకాలకు దూరంగా ఉండడం, ఆన్‌లైన్ సమావేశాలు నిర్వహించడం లాంటి చర్యలతో ఖర్చులను నియంత్రిస్తూ, లాభాల బాటలో నడిచే ప్రయత్నాలు చేస్తున్నాయి. కోవిడ్-19 తాకిడికి తగ్గట్లుగా కంపెనీలు తమ కార్యశీలతలను మార్చుకుంటూ, కరోనా కాలాన్ని అధిగమిస్తూ నడిచే ప్రయత్నాలు చేస్తున్నాయి. కోవిడ్-19 కోరల్లోంచి ఆర్థిక స్థితిని విడుదల చేయడానికి మార్చి-2021లో ఆర్‌బిఐ 3.74 లక్షల కోట్లను పలు యంయస్‌యంఈలకు విడుదల చేయడంతో మార్కెట్‌లో నగదు కదలికలు (లిక్విడిటీ) పెరిగాయి.

మే-2020లో రిలియన్స్ ఇండస్ట్రీస్ రైట్స్ ఇష్యూ ద్వారా 53,125 కోట్లు సేకరించి మార్కెట్ పెట్టుబడిదారులలో ఆత్మవిశ్వాసాన్ని నింపగలిగాయి. గత ఎనిమిదేళ్లలో ఇష్యూల రూపంలో 160 ఐపిఓ కంపెనీలు 1.94 లక్షల కోట్ల నిధులను సేకరించాయి. ఇటీవలే పలు స్టార్ట్ అప్ కంపెనీలు ఐపిఓల ద్వారా నిధులను సేకరించడానికి, వ్యాపార విస్తరణ, లాభాల బాటలో నడవడానికి కృషి చేస్తున్నాయి. వైరస్ మహావిపత్తులకు భయపడకుండా, అసాధారణ పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకుంటూ, సత్ఫలితాల దిశలో కంపెనీలు నడవడానికి, దేశ ఆర్థికవ్యవస్థ పరిపుష్టికి దోహదపడాలని కోరుకుందాం. కరోనా మహమ్మారి అలలను నిరోధిస్తూ దలాల్ స్ట్రీట్ వేగం పుంజుకోవడం హర్షదాయకం. కరోనా 3వ వేవ్ రావచ్చన్న హెచ్చరికలతో కంపెనీలు తమ పనితనానికి పదునుపెడుతూ, దేశ ఆర్థిక చక్రానికి కందెనరాస్తూ, బహుముఖీన ప్రగతి రథ పరుగులు జరపాలని ఆశిద్దాం.



- డా|| బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## సెమి స్కిల్డ్ మరియు స్కిల్డ్ పర్సన్స్ కు ఉద్యోగాలు

న్యూఢిల్లీ, జులై 20:సంబంధిత రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి మిషన్ల (ఎస్ఎస్‌డిఎం) మార్గదర్శకత్వంలో జిల్లా నైపుణ్య కమిటీలు (డిఎస్‌సి) నైపుణ్య వ్యత్యాసాన్ని పరిష్కరించడంలో మరియు గ్రామీణ ప్రాంతాలతో పాటు జిల్లా స్థాయిలో డిమాండ్‌ను అంచనా వేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అట్టడుగు ప్రాంతాలలో వికేంద్రీకృత ప్రణాళిక మరియు అమలును ప్రోత్సహించడానికి డిఎస్‌సిలను జిల్లా నైపుణ్య అభివృద్ధి ప్రణాళికల (డిఎస్‌డిపి) అభివృద్ధికి అప్పగించారు. డిఎస్‌సిల సామర్థ్యాన్ని పెంపొందించడానికి మరియు నైపుణ్య అభివృద్ధి ప్రణాళిక మరియు ప్రోగ్రామ్ డెలివరీని నిర్వహించడంలో వారికి సహాయపడటానికి, నైపుణ్య అభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ (ఎంఎస్‌డిఇ) మహాత్మా గాంధీ నేషనల్ ఫెలోలను జిల్లా పరిపాలనతో జతచేస్తుంది. ఫెలోస్ అకాడెమిక్ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రీమియర్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్స్‌లో పోస్ట్ చేయబడతాయి, ఇది ఆన్-గ్రౌండ్ ప్రాక్టికల్ అనుభవంలో అంతర్నిర్మిత భాగాన్ని కలిగి ఉంటుంది. ఇప్పటివరకు, 31 రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాల నుండి మొత్తం 512 డిఎస్‌డిపిలు వచ్చాయి. డిఎస్‌డిపిలు ఉపాధి అవకాశాలు మరియు నైపుణ్యానికి డిమాండ్ ఉన్న రంగాలను గుర్తిస్తాయి.

గరిబ్ కళ్యాణ్ రోజ్‌గర్ అభియాన్ (జికెఆర్‌ఎ) కింద గుర్తించిన వలస కార్మికుల నైపుణ్య శిక్షణ అవసరాన్ని పరిష్కరించడానికి ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన (పిఎంకెవివై) కింద వలస కార్మికులకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలను సృష్టించడం కోసం జిల్లా నిర్దిష్ట డిమాండ్ ఆధారిత స్కిల్లింగ్‌ను ఎంఎస్‌డిఇ చేపట్టింది. అస్సాం, బీహార్, ఒడిశా, రాజస్థాన్, మధ్యప్రదేశ్ మరియు ఉత్తర ప్రదేశ్ వంటి 6 రాష్ట్రాల్లో 119 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమం కింద ఇప్పటివరకు శిక్షణ పొందిన వలస కార్మికుల సంఖ్య 70,823. శిక్షణ కోసం ఉద్యోగ పాత్రలను ఎన్నుకునేటప్పుడు స్థానిక / జిల్లా స్థాయిలో నియామకం / ఉద్యోగ అవకాశం, స్వయం ఉపాధికి తోడ్పడటానికి బ్యాంకు రుణాన్ని సులభతరం చేయడం మరియు స్థానిక శిక్షణా కేంద్రాలలో అందుబాటులో ఉన్న ఉద్యోగాలు వంటి అంశాలు పరిగణించబడ్డాయి.

డిఎస్‌సిలు అభివృద్ధి చేసిన డిఎస్‌డిపిలు స్థానిక ఆర్థిక వ్యవస్థలో ఉపాధికి అవకాశం ఉన్న రంగాలను గుర్తిస్తాయి. 15.01.2021 న ప్రారంభించిన పిఎంకెవివై 3.0 కింద, నైపుణ్య శిక్షణను డిమాండ్‌తో నడిపించారు. డిఎస్‌సిలు తమ జిల్లాకు సంబంధించిన ఉద్యోగ పాత్రలను గుర్తించాయి. దీర్ఘకాలంలో నైపుణ్యం ఉన్న అభ్యర్థులు అదే ప్రాంతంలో ఎక్కువ సంఖ్యలో ఉపాధి పొందుతారు.

ఈ సమాచారాన్ని కేంద్ర నైపుణ్య అభివృద్ధి, వ్యవస్థాపకత శాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ఈ రోజు లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో అందించారు.

## బహాదుర్ దేవుబాతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేపాల్ ప్రధాని శేర్

న్యూఢిల్లీ, జులై 20:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న నేపాల్ ప్రధాని శ్రీ శేర్ బహాదుర్ దేవుబా తో టెలిఫోన్ లో మాట్లాడారు. నేపాల్ ప్రధాని గా శ్రీ శేర్ బహాదుర్ దేవుబా ఎన్నికైనందుకు మరియు పార్లమెంట్ లో విశ్వాస తీర్మానం పై జరిగిన వోటింగు లో గెలుపు ను సాధించినందుకు ఆయన ను శ్రీ నరేంద్ర మోదీ అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

భారతదేశాని కి, నేపాల్ కు మధ్య నెలకొన్న విశిష్టమైనటువంటి మరియు ఉ భయ దేశాల ప్రజల మధ్య ప్రత్యేక మైత్రి ని సూచిస్తూ ఉన్నటువంటి శతాబ్దాల నాటి సంబంధాల ను గురించి ఈ సందర్భం లో ఇరువురు నేత లు గుర్తు కు తెచ్చుకొన్నారు. అన్ని రంగాల లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత గా పెంచుకోవడం కోసం కలసి పని చేయడానికి వారు సమ్మతి ని వ్యక్తం చేశారు.

మరీ ముఖ్యం గా, కోవిడ్-19 మహమ్మారి కి వ్యతిరేకం గా ప్రస్తుతం చేస్తున్న ప్రయత్నాల ను సమన్వయ పరచుకోవడం గురించి, తత్సంబంధిత సహకారాన్ని బలోపేతం చేసుకోవడం గురించిన పద్ధతుల పై వారు చర్చించారు.

## బ్యాంక్ పుస్తకాల్లోని భారాన్ని తగ్గించే చర్యగా నిరర్థక ఆస్తుల కోసం 'బ్యాడ్ బ్యాంక్' ప్రారంభం

న్యూఢిల్లీ, జులై 20:కేంద్ర ప్రభుత్వం అన్ని ఆమోదాలు, లాంఛనాలతో 'బ్యాడ్ బ్యాంక్'ను ప్రారంభించింది. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి డా. భగవత్ కిషన్‌రావ్ కరాడ్ ఈ విషయాన్ని లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా వెల్లడించారు.

కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మల సీతారామన్, 2021-22 బడ్జెట్ ప్రసంగంలో ఈ క్రింది ప్రకటన చేశారు:

"ఖాతా పుస్తకాల్లోని భారాన్ని తగ్గించేందుకు, పెద్ద మొండి బకాయిల (నిరర్థక ఆస్తులు) వసూళ్ల చర్యలను ప్రభుత్వ రంగ బ్యాంకులు కోరుతున్నాయి. ప్రస్తుతమున్న నిరర్థక ఆస్తులను ఏకీకృతం చేయడానికి, స్వాధీనం చేసుకోవడానికి "అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్, అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ"ని ఏర్పాటు చేస్తాం. ఆ తర్వాత, నిరర్థక ఆస్తులను నిర్వహించి, వాటి విలువ నిర్ధరణ కోసం ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధులకు, ఇతర పెట్టుబడిదారులకు బదిలీ చేస్తాం."

'నేషనల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్' (ఎన్ఐఆర్‌సీఎల్)ను 07.07.2021న 'రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్' వద్ద నమోదు చేసినట్లు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) వివరించిందని మంత్రి పేర్కొన్నారు.

అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీస్ (ఏఆర్‌సీ) నియంత్రణ సంస్థగా ఉన్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏఆర్‌సీల కోసం ఇప్పటికే విధివిధానాలను నిర్దేశించింది. బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు తమ నిరర్థక ఆస్తులను ఏఆర్‌సీలకు బదిలీ చేయడానికి చక్కటి నిబంధనలు ఉన్నాయి. ఏఆర్‌సీల ద్వారా నిరర్థక ఆస్తుల గుర్తింపు అనేది కొనసాగుతున్న ప్రక్రియగా కేంద్ర మంత్రి తెలిపారు.

## కోవిడ్ మహమ్మారిపై పోరాటానికి వివిధ రంగాలకు ప్రభుత్వ సహాయక చర్యలు

న్యూఢిల్లీ, జులై 20: ఆరోగ్య రంగ మౌలిక సదుపాయాలు సహా వివిధ రంగాలకు ఆత్మనిర్భర్ ప్యాకేజీల కింద 13 మే 2020 నుంచి 17 మే 2020, 12 అక్టోబర్ 2020, 12 నవంబర్ 2020న పలు దశలలో మొత్తం రూ. 29,87,641 కోట్లను (ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ ప్యాకేజీ, జులై నుంచి నవంబర్ వరకు ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన , ఆర్‌బిఐ ప్రకటించిన చర్యలు సహా) ప్రభుత్వం పలు సహాయక చర్యలను ప్రకటించింది. ఈ సమాచారాన్ని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం నాడు ఒక ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానం ద్వారా వెల్లడించారు. పైన పేర్కొన్న ప్యాకేజీలే కాకుండా రూ. 6.28 లక్షల కోట్ల రూపాయిల కోవిడ్ సహాయక ప్యాకేజీని కూడా 28.06.2021న ప్రకటించినట్టు మంత్రి పేర్కొన్నారు.

## కొందరు వ్యక్తుల ఫోన్ల సమాచారంపై

# పార్లమెంటులో కేంద్ర ఐ.టి. మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటన

న్యూఢిల్లీ, జులై 20:"కొందరు వ్యక్తుల ఫోన్ల సమాచారంపై పెగాసస్ అనే స్పైవేర్ వినియోగం ద్వారా నిఘా పెట్టినట్టుగా ఈ ఏడాది జులై 18వ తేదీ (ఆదివారం) కొన్ని సమాచార మాధ్యమాల్లో వచ్చిన కథనాల"పై కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సోమవారం లోక్ సభలో ఈ కింది విధంగా ప్రకటన చేశారు:

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి ఒకరోజు ముందుగా ఈ వార్తా కథనాలు వెలువడ్డాయి. ఇలా జరగడం యాదృచ్ఛికం కాకపోవచ్చు.

వాట్సప్ సమాచారంపై కూడా పెగాసస్ వినియోగం జరిగినట్టు గతంలో కూడా ఇలాగే వాదనలు వచ్చాయి. ఈ కథనాలకు ఎలాంటి ఆధారాలు లేవు. ఈ కథనాలను సుప్రీంకోర్టుతో సహా అన్ని వర్గాలూ ఖండించాయి. 2021వ సంవత్సరం జూలై 18వ తేదీ ఈ వార్తా కథనాలను వెలువరించడం,.. భారతీయ ప్రజాస్వామ్యాన్ని, వ్యవస్థలను అపఖ్యాతిపాలు చేయడానికే జరిగినట్టుగా కనిపిస్తోంది.

ఈ వార్తా కథనాన్ని సంపూర్ణంగా, వివరంగా చదవని వారిని మేం తప్పుబట్టలేం. ఈ నేపథ్యంలో ఈ అంశాలన్నింటినీ వాస్తవాల ప్రాతిపదికగా, తార్కిక వివేచనలో పరిశీలించాలని గౌరవనీయ సభ్యులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. ఏవో కొన్ని సంస్థల కూటమి (కన్సార్షియం) 50వేల ఫోన్ నంబర్లకు సంబంధించిన, లీకైన సమాచారం సంపాదించిందన్న అంశం ఆధారంగా ఈ వార్తా కథనం ఇచ్చారు. ఈ ఫోన్ నంబర్లకు సంబంధం ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టారన్నది ఆరోపణ. అయితే, ఈ కథనం ఏం చెబుతుందంటే..:

సేకరించిన సమాచారంలో ఏదైనా ఒక ఫోన్ నంబరు ఉన్నంత మాత్రాన, సదరు ఫోన్ పెగాసస్ స్పైవేర్.తో ప్రభావితం అయినట్టుగానీ, హ్యాకింగ్ కు ప్రయత్నం జరిగినట్టుగానీ స్పష్టంగా తెలియదు.

ఏదైనా ఫోన్.పై సాంకేతికపరమైన విశ్లేషణ జరపనిదే, దానిపై నిఘా దాడి ప్రయత్నం జరిగిందనిగానీ, దాని సమాచారం సేకరించారనిగానీ కచ్చితంగా, నిర్ధారణగా చెప్పలేం.

అందువల్ల, కేవలం డాటాలో ఫోన్ నంబరు ఉన్నంత మాత్రాన దాని సమాచారంపై నిఘా పెట్టేందుకు అవకాశం ఉండబోదని వార్తా కథనమే చెబుతోంది.

గౌరవ సభాపతి గారూ... సదరు సాంకేతిక పరిజ్ఞానం సొంతంగా కలిగిఉన్న ఎన్.ఎస్.ఒ. అనే కంపెనీ ఏం చెప్పిందో ఒకసారి పరిశీలిద్దాం. అది ఏం చెప్పిందంటే..:

మీకు అందించిన కథనాలు హెచ్.ఎల్.ఆర్. లుకప్ సర్వీసెస్ వంటి మౌలిక సమాచారంనుంచి లీకై వక్రీకరణకు గురైన డాటా ఆధారంగా తయారైనట్టు ఎన్.ఎస్.ఒ. గ్రూపు సంస్థ భావిస్తోంది. పెగాసస్ స్పైవేర్ లక్ష్యంగా చేసుకున్న వినియోగదారుల జాబితాతోగానీ, ఎన్.ఎస్.ఒ. ఇతర ఉత్పాదనలతో గానీ ఈ డాటాతో సంబంధం ఉండదు.

ఇలాంటి సేవలు ఎవరికైనా, ఎక్కడైనా అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు సంస్థలు కూడా ప్రపంచ వ్యాప్తంగా సాధారణంగా ఈ సేవలను వినియోగించుకుంటూనే ఉంటాయి. ఈ డాటాకు, నిఘాకు, లేదా ఎన్.ఎస్.ఒ. సంస్థకు సంబంధమే లేదనడం కూడా నిర్విదాంశం. అందువల్ల, డాటాను వినియోగించినంత మాత్రాన అది నిఘాతో సమానమని చెప్పేందుకు ఎలాంటి అధారాలూ లేవు.

పెగాసస్.ను వినియోగిస్తున్నట్టుగా పేర్కొంటూ సూచించిన దేశాల జాబితా సరైనది కాదని ఎన్.ఎస్.ఒ. కూడా చెప్పింది. జాబితాలో ప్రస్తావించిన చాలావరకూ దేశాలు తమ క్లయింట్లు కానే కాదని స్పష్టం చేసింది. తమ క్లయింట్లలో ఎక్కువగా పశ్చిమ దేశాలే ఉన్నాయని కూడా ఎన్.ఎస్.ఒ. పేర్కొంది.

నిఘాపై ఈవార్తా కథనంలో పేర్కొన్న వాదనలను ఎన్.ఎస్.ఒ. కూడా కొట్టి పారేసిందని స్పష్టంగా తెలుస్తోంది.

గౌరవ సభాపతిగారూ...నిఘాకు సంబంధించి భారతదేశం పాటించే నిబంధనలను మనం పరిశీలిద్దాం. చాలా ఏళ్లపాటు ప్రభుత్వంలో ఉంటూ వచ్చిన ప్రతిపక్షంలోని నా సహచరులకు కూడా ఈ నిబంధనల గురించి బాగా తెలుసు. గతంలో దేశాన్ని పరిపాలించారు కాబట్టి, అక్రమంగా నిఘా పెట్టడం ఏ రూపంలోనూ సాధ్యం కాదని వారికీ తెలిసి ఉంటుంది. మన చట్టాల్లో, పటిష్టమైన మన వ్యవస్థల్లో ఎక్కడికక్కడ తనిఖీలు, సంతులన పద్ధతులు ఉన్నందున అక్రమ నిఘా సాధ్యం కాదని వారికి కూడా తెలిసే ఉండాలి.

భారతదేశంలో ఏదైనా ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్.పై నిఘాకోసం చట్టబద్ధమైన విధానం మాత్రమే అమలులో ఉంది. అదీ జాతీయ భద్రత కోసమే జరుగుతుంది. ప్రజల అత్యవసరాల దృష్ట్యా, ప్రజాప్రయోజనాల కోసం మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధీకృత సంస్థల ద్వారా మాత్రమే జరుగుతుంది. 1885వ సంవత్సరపు భారతీయ టెలిగ్రాఫ్ చట్టం. 5(2)వ సెక్షన్,.. 2000వ సంవత్సరపు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని 69వ సెక్షన్లలో పేర్కొన్న నిబంధనల ప్రకారం, తగిన విజ్ఞప్తులు అందినపుడు చట్టబద్ధంగా మాత్రమే ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్లపై నిఘా పెట్టడం జరుగుతుంది.

అధీకృత సంస్థ నుంచి తగిన అనుమతి ఉన్న సందర్భంలోనే ఇలా పర్యవేక్షణ, నిఘా చోటుచేసుకుంటుంది. రాష్ట్రప్రభుత్వాల అధీనంలోని అధీకృత సంస్థలకు కూడా ఇదే రకం అధికారాలు అందుబాటులో ఉంటాయి. 2009వ సంవత్సరపు ఐ.టి. నిబంధనల చట్టం అనుగుణంగా ఈ అధికారాల వినియోగం జరుగుతుంది.

ఈ మొత్తం వ్యవహారాన్ని సమీక్షించేందుకు ఒక యంత్రాంగం ఉంటుంది. కేంద్ర కేబినెట్ కార్యదర్శి అధ్యక్షతలోని సమీక్షా సంఘం ఈ సమీక్ష చేపడుతుంది. రాష్ట్ర ప్రభుత్వాల్లో అయితే, సంబంధిత ప్రధాన కార్యదర్శి సారథ్యంలోని కమిటీ సమీక్ష జరుపుతుంది. ఏదైనా సందర్భంలో నిఘా ప్రక్రియలో ఎవరికైనా ఇబ్బంది తలెత్తితే దానిపై తగిన విచారణ జరిపేందుకు న్యాయ విచారణకు నిర్వహించేందుకు కూడా చట్టంలో వెసులుబాటు ఉంది.

ఏదైనా ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్.పై నిఘా పెట్టడం, పర్యవేక్షించడం అనేవి చట్టానికి అనుగుణంగానే జరిగేలా ఈ ప్రక్రియలో తగిన ఏర్పాట్లు ఉన్నాయి. ఎన్నో పరీక్షా సమయాలను కూడా అధిగమిస్తూ, ఈ మొత్తం వ్యవస్థ, అధీకృత సంస్థలూ గట్టిగా నిలబడ్డాయి.

గౌరవ స్పీకర్ గారూ...చివరగా నేను మీకు కొన్ని విషయాలను వినమ్రంగా నివేదిస్తాను:

ప్రచురించిన ఫోన్ నంబర్లు నిఘా నీడలో ఉన్నాయని తాము పేర్కొనజాలమని కథనం వెలువరించిన ప్రచురణ కర్తే చెబుతున్నారు.నిఘాకోసం ఏ టెక్నాలజీని అయితే వినియోగించారని భావిస్తున్నారో., సదరు టెక్నాలజీకి సొంతదారైన కంపెనీ కూడా ఈ నిఘా వాదనలను స్పష్టంగా కొట్టిపారేస్తోంది.

## మున్సిపాలిటీలలో ఇంటింటి చెత్త సేకరణ విధిగా జరగాలి

### - సంబంధిత అధికారులకు ఆదేశించిన అదనపు కలెక్టర్ రాజర్షి షా



సంగారెడ్డి, జూలై 20 (నేటినిజం ప్రతినిధి) సోమవారం నాడు కలెక్టరేట్ మినిమీటింగ్ హాల్ లో అమీన్ పూర్, బొల్లారం , నారాయణఖేడ్ మరియు తెల్లాపూర్ మునిసిపాలిటీల కమీషనర్లు, మునిసిపల్ ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్స్ , సానిటరీ ఇన్స్పెక్టర్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజర్షి మాట్లాడుతూ మునిసిపాలిటీలలో ఇండ్ల నుండి తడి పొడి చెత్త సేకరణ జరగాలని, తడి చెత్త నుండి సేంద్రియ ఎరువు తయారు కావాలన్నారు. పొడి చెత్తను డి ఆర్ సి సి ద్వారా మార్కెట్ లో విక్రయించే విధంగా మునిసిపల్ కమిషనర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్ లు పని చేయాలని ఆదేశించారు.

మునిసిపల్ కమిషనర్లు ప్రతి రోజు ఉదయం 5 గంటలకు వార్డు లలో తిరిగి శానిటేషన్ పనులను, తడి మరియు పొడి చెత్త సేకరణ పరిశీలించాలని ఆదేశించారు. మునిసిపాలిటీ పరిధి లో 2021-22 సంవత్సరం లో హరిత హారం లో భాగము గా ఇండ్లకు సరఫరా చేయు మొక్కలు, ఇన్స్టిట్యూషనల్ ప్లాంటేషన్, అవెన్యూ ప్లాంటేషన్ లక్ష్యాలను సాధించాలని చెప్పారు. నాటిన మొక్కలను సంరక్షించే పూర్తి బాధ్యత మునిసిపల్ కమిషనర్, హరిత హారం సిబ్బందిదని అన్నారు.

మునిసిపాలిటీల లో మహా ప్రస్థానం, వెజ్ మరియు నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలన అనుమతులుఇచ్చిందన్నారు.

నిర్ణిత సమయములో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

మునిసిపాలిటీ కి కేటాయించిన 10% గ్రీన్ బడ్జెట్ ను పూర్తిగా ఉపయోగించాలని తెలిపారు. మునిసిపాలిటీ పరిధి లో వున్న వైకుంధామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశం లో మునిసిపల్ కమిషనర్ లు, మునిసిపల్ ఇంజనీర్ లు , టౌన్ ప్లానింగ్ సిబ్బంది , సానిటరీ ఇన్స్పెక్టర్ లు పాల్గొన్నారు

## ఉచిత నైపుణ్య శిక్షణతో ఉపాధికి మార్గం సుగమం..! -అదనపు కలెక్టర్ రాజర్షి షా



సంగారెడ్డి, జూలై 20(నేటినిజం ప్రతినిధి) మంగళవారంనాడు అదనపు కలెక్టర్ అధ్యక్షతన ఆయన చాంబర్ లో స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సలహా కమిటీ సమావేశం జరిగింది. శిక్షణా సంస్థలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా రాజర్షి మాట్లాడుతూ యస్ బి ఆర్ యస్ ఈ టి ఐ అందిస్తున్న శిక్షణ లను ఎక్కువమంది వినియోగించుకునేలా యువతను చైతన్య పరచాలని అధికారులను కోరారు. యస్ బి ఆర్ యస్ ఈ టి ఐ ద్వారా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల తో అభ్యర్థులలో నైపుణ్యాలు మెరుగుపడతాయన్నారు. షెడ్యూల్ కులాల కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సాయం పొందుతున్న లబ్ధిదారులకు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ లో శిక్షణ తప్పనిసరి చేయడంతో,వారు ఆయా రంగాలలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

శిక్షణ పొందిన వారికి అవసరమైన రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు స్టేట్ బ్యాంక్ సంగారెడ్డి రీజనల్ మేనేజర్ కళ్యాణ్ తెలిపారు.

యస్ బి ఆర్ యస్ ఈ టి ఐ ద్వారా గత సంవత్సరం 300 మందికి శిక్షణ లక్ష్యం కాగా, 314 మందికి శిక్షణ ఇచ్చామని, ప్రస్తుత సంవత్సరం 600 మందికి శిక్షణ ఇవ్వడం లక్ష్యంగా ఉందని యస్ బి ఆర్ యస్ ఈ టి ఐ సంస్థ డైరెక్టర్ వంగా రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రమణారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సుమన ప్రియాంక, నాబార్డ్ జిల్లా అధికారి కృష్ణ తేజ, డి ఆర్ డి ఓ శ్రీనివాస రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబురావు, శివశంకర్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు

## దళితలకు సబ్సిడీ రుణాలు అందకుండ చేస్తున్న ఈడిపై చర్యలు తీసుకోవాలి

**-ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి రుణాలు మంజూరు చేయాలి.**

**-పందిరి కూరగాయలు రుణాలు కాంట్రాక్టర్లకు కాకుండా నేరుగా రైతులకే ఇవ్వాలి.**

**-బ్యాంక్ లింకేజీ లేకుండా పది లక్షల వరకు రుణాలు ఇవ్వాలి.**

**-కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్.**

**-ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబురావును తొలగించాలని కలెక్టర్ కార్యాలయం ముందు కెవిపిఎస్ ధర్నా.**



సంగారెడ్డి జులై 20 (నేటినిజం ప్రతినిధి) దళితులకు సబ్సిడీ రుణాలు అందకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న ఈడి పై చర్యలు తీసుకోవాలని,దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి రుణాలు ఇవ్వాలని, పందిరి కూరగాయల రుణాలు కాంట్రాక్టర్ కాకుండా నేరుగా రైతులకు ఇవ్వాలని,బ్యాంక్ లింకేజీ లేకుండా పది లక్షల వరకు రుణాలు ఇవ్వాలని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు.

ఈరోజు కలెక్టర్ కార్యాలయం ముందు కెవిపిఎస్,ఎస్ ఎస్ డి ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది ధర్నా వద్దకు ఈడి రావాలని పట్టుపట్టడంతో ఎస్సీ కార్పొరేషన్ అధికారులు వచ్చి వినతి పత్రం తీసుకోవడం జరిగింది

ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ మాట్లాడుతూ 2020-21 సంవత్సరానికి సుమారు 3500 మంది దరఖాస్తు చేసుకున్నారని, పందిరి కూరగాయల కోసం 2018 సంవత్సరంలో సుమారు 350 మంది దరఖాస్తు చేసుకున్నారని ఈడి వైఖరివల్ల రుణాలు అందడం లేదనిఅన్నారు అధికారులు బ్యాంకుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా రుణాలు అందడం లేదని అన్నారు రుణాల కోసం నోటిఫికేషన్ వేసేటప్పుడు ఎటువంటి నిబంధనలు ఉండటం లేదని ఇంటర్వ్యూలో మాత్రం స్కిల్డ్ పేరుతో సర్టిఫికెట్లు కావాలని, లేని వాళ్ళకు లోన్లు రావని ఈ డి బాబురావు స్వయానా చెబుతున్నాడని అన్నారు నోటిఫికేషన్ లో స్కీమ్ విలువ లోను ఇవ్వకుండా కొత పెట్టుతున్నారు అని అన్నారు పందిరి కూరగాయలు స్కీమ్ లోను 3.50లక్షలు అందులో 2.10లక్షలు సబ్సిడి మిగత 1.40లక్షలు బ్యాంక్ లోను బ్యాంక్ లోనుకు రైతుల భూములను తాకట్టు పెట్టుకుంటేనే లోను ఇస్తాం అని షరతులు పడుతున్నారని అన్నారు రైతుల డబ్బులతో కాంట్రాక్టర్ల సోకులు ఏంటి అన్నారు దీంతో మూడు సంవత్సరాలుగా రైతులు ముందుకు రావడం లేదని అన్నారు పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోని పరిస్థితి లేదని అన్నారు

జిల్లాలో దళితులకు తీవ్ర అన్యాయం చేస్తున్న ఈడిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు

ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దప్పు విద్యాసాగర్ ఎస్ ఎస్ డి జిల్లా అధ్యక్షులు బాలరాజ్ జహీరాబాద్ డివిజన్ అధ్యక్షులు రవి కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొఠారి నర్సింలు, సహాయ కార్యదర్శి సుభాష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అనిల్ జిల్లా కార్యదర్శి రమేష్ అధ్యక్షులు సందీప్ కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్, గణపతి, మహేష్ కెవిపిఎస్ నాయకులు గంగారం దత్తు దళిత మహిళా రైతులు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆన్-లైన్ లో దర్శించడానికి వీలుగా అందుబాటులో ఉన్నాయి : శ్రీ జి. కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, జులై 20:కోవిడ్-19 ప్రారంభానికి ముందే, ఏప్రిల్, 2014 నుండి జతాన్ కార్యక్రమం ద్వారా పది (10) మ్యూజియంలలోని కళాఖండాలను డిజిటలైజేషన్ చేసే పనిని సాంస్కృతిక మంత్రిత్వ శాఖ చేపట్టింది. దీనితో పాటు, మంత్రిత్వ శాఖ 'మ్యూజియం గ్రాంట్ స్కీమ్' అనే పథకాన్ని కూడా నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న మ్యూజియంలలోని కళా ఖండాలను ఆన్-లైన్ లో దర్శించడానికి, వెబ్-సైట్ లో వాటి చిత్రాలు / జాబితాలను అందుబాటులో ఉంచడానికి వీలుగా, డిజిటలైజ్ చెయ్యడం కోసం రాష్ట్ర ప్రభుత్వాలు, సంఘాలు, స్వయంప్రతిపత్తి సంస్థలు, స్థానిక సంస్థలు, సొసైటీల చట్టం కింద నమోదుదైన ట్రస్టులకు, ఈ పథకం కింద, ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతోంది.

http://museumsofindia.gov.in వెబ్-సైట్ ద్వారా ఆన్-లైన్ లో వీక్షించడానికి వీలుగా, 30.06.2021 తేదీ నాటికి, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ మ్యూజియంలు, గ్యాలరీలలో అందుబాటులో ఉన్న కళాఖండాల సంఖ్య క్రింద ఇవ్వబడింది:

ఈ సమాచారాన్ని సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ఈ రోజు లోక్‌సభకు సమర్పించిన లిఖితపూర్వక సమాధానంలో పొందుపరిచారు.

సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖల మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ఈ రోజు లోక్-సభకు అందజేసిన లిఖితపూర్వక సమాధానంలో ఈ సమాచారాన్ని పొందుపరిచారు.

## నేడు టీఆర్ఎస్‌లో చేరనున్న కౌశిక్ రెడ్డి..

హైదరాబాద్ , జులై 20:హుజురాబాద్ ఉపఎన్నికల నేపథ్యంలో రాజకియాలు రసవత్తరంగా మారుతున్నాయి?మాజీ కాంగ్రెస్ నేత హుజురాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి రేపు టీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్ సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నట్లు ఆయన ప్రకటించారు. యోజకవర్గ ప్రజలు, తన మద్దతుదారుల కోరిక మేరకు.. టీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నాని తెలిపారు. అంతేకాదు తెలంగాణలో సీఎం కేసీఆర్ పాలనకు ఆకర్షితుడయ్యానని.. కేసీఆర్ పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని అన్నారు. తెలంగాణ దళిత బంధు పథకం అమలుకు హుజురాబాద్ నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం గొప్ప విషయమన్నారు. ఇక సీఎం కేసీఆర్ ఇచ్చిన అవకాశాన్ని ఈటల రాజేందర్ దుర్వినియోగం చేశారని విమర్శించారు. ఈటల రాజేందర్ నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదని?తనకు తన సొంత అభివృద్ధి కోసం నియోజకవర్గ ప్రజలను మోసం చేశారని కౌశిక్ రెడ్డి మండిపడ్డారు.

## సిజిఎస్ కింద ఎంఎస్ఎంఇ పరిశ్రమలకు రుణాలు

న్యూఢిల్లీ, జులై 20:వాణిజ్య కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్న ఉత్పత్తి లేదా సేవలు అందించే నూతన, ఇప్పటికే ఉనికిలో ఉన్న సూక్ష్మ, చిన్న తరహా సంస్థలకు క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ట్రస్ట్ ఫర్ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ (సిజిటిఎంఎస్ఇ) అమలు చేస్తున్న పరపతి గ్యారంటీ పథకం (సిజిఎస్) పరిధిలోకి రావడానికి అర్హులు. యోగ్యమైన ప్రతిపాదనలను తిరస్కరించడం జరుగదు. సిజిటిఎంఎస్ఇ 30 జూన్ 2021వరకూ రూ.2,72,007 కోట్ల మేరకు 53,86,739 గ్యారంటీలను ఆమోదించింది. ఆర్థిక సంవత్సరం 2021-22 తొలి త్రైమాసికంలో బ్యాంకులకు, ఎన్‌బిఎఫ్‌సిలకు గ్యారంటీ ఆమోదాలు రూ, 6,693 కోట్లు, రూ.6,603 కోట్లు ప్రత్యేకంగా కేటాయించినట్టు సిజిటిఎంఎస్ఇ నివేదించింది. ఇది ఆర్థిక సంవత్సరం 2020-2021 తొలి త్రైమాసికంలో ఈ మొత్తం రూ. 6,041 కోట్లు, రూ. 2,934 కోట్లగా ఉంది.

ఆర్థిక సంవత్సరం 2020-2021లో సిజిటిఎంఎస్ఇ తెలంగాణా రాష్ట్రం నుంచి వచ్చిన రూ. 1,408 కోట్ల మొత్తాన్ని కేటాయిస్తూ 22,021 గారంటీ దరఖాస్తులను ఆమోదించింది.

భారత ప్రభుత్వం ఎంఎస్ ఎంఇ రంగం సహా భారతీయ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడేందుకు పరిహార ప్యాకేజీని ప్రకటించింది. ఈ సూక్ష్మ ఆర్థిక సంస్థలు (మైక్రో ఫైనాన్స్ ఇనిస్టిట్యూషన్స్) ద్వారా దాదాపు 25 లక్షల మంది చిన్న స్థాయి లబ్ధిదారులకు రుణాలను అందించేందుకు కోవిడ్ కారణంగా ప్రభావితమైన రంగాలకు రూ.1.1 లక్షల కోట్లు, అదనంగా అత్యవసర క్రెడిట్ లైన్ గ్యారెంటీ పథకం, రుణ హామీ పథకం కింద రూ. 1.5 లక్షల కోట్లను అందించడం ఈ ప్యాకేజీ లక్ష్యం.

ఈ సమాచారాన్ని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వాణిజ్యసంస్థల మంత్రి నారాయణ్ రాణె సోమవారం రాజ్యసభకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానం ద్వారా వెల్లడించారు.

## ఎంఎస్ఎంఈల సామర్థ్యం విస్తరణ, వృద్ధి

న్యూఢిల్లీ, జులై 20:అభివృద్ధికి అవకాశం ఉండి, పెద్ద యూనిట్లుగా మారే సామర్థ్యం ఉన్న ఉన్న ఎంఎస్ఎంఈలలో, వాటాల కొనుగోలు రూపంలో రూ.50 వేల కోట్లను పెట్టుబడులుగా పెట్టడానికి "భారత స్వావలంబన నిధి" (ఎస్ఆర్ఐ) పేరిట కేంద్ర ప్రభుత్వం ఒక నిధిని ప్రకటించింది. ఈ పథకం కింద ప్రకటించిన మొత్తం రూ.50 వేల కోట్లలో కేంద్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్లను సమకూరుస్తుంది. మిగిలిన రూ.40 వేల కోట్లు ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ ఫండ్లు తీసుకొస్తాయి. ఈ ఆర్థిక మొత్తంపై మార్గదర్శకాలు కూడా జారీ అయ్యాయి. ఎంఎస్ఎంఈ రంగంలో అర్హతగల యూనిట్లకు అభివృద్ధి మూలధనాన్ని అందించడమే ఈ చర్య లక్ష్యం.

కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ నారాయణ్ రాణే ఈ సమాచారాన్ని లిఖితపూర్వక సమాధానంగా ఇవాళ రాజ్యసభకు సమర్పించారు.

## సెమీ స్కిల్డ్ మరియు స్కిల్డ్ పర్సన్స్ కు ఉద్యోగాలు

న్యూఢిల్లీ, జులై 20:సంబంధిత రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి మిషన్ల (ఎస్ఎస్‌డిఎం) మార్గదర్శకత్వంలో జిల్లా నైపుణ్య కమిటీలు (డిఎస్‌సి) నైపుణ్య వ్యత్యాసాన్ని పరిష్కరించడంలో మరియు గ్రామీణ ప్రాంతాలతో పాటు జిల్లా స్థాయిలో డిమాండ్‌ను అంచనా వేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అట్టడుగు ప్రాంతాలలో వికేంద్రీకృత ప్రణాళిక మరియు అమలును ప్రోత్సహించడానికి డిఎస్‌సిలను జిల్లా నైపుణ్య అభివృద్ధి ప్రణాళికల (డిఎస్‌డిపి) అభివృద్ధికి అప్పగించారు. డిఎస్‌సిల సామర్థ్యాన్ని పెంపొందించడానికి మరియు నైపుణ్య అభివృద్ధి ప్రణాళిక మరియు ప్రోగ్రామ్ డెలివరీని నిర్వహించడంలో వారికి సహాయపడటానికి, నైపుణ్య అభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ (ఎంఎస్‌డిఇ) మహాత్మా గాంధీ నేషనల్ ఫెలోలను జిల్లా పరిపాలనతో జతచేస్తుంది. ఫెలోస్ అకాడెమిక్ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రీమియర్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్స్‌లో పోస్ట్ చేయబడతాయి, ఇది ఆన్-గ్రౌండ్ ప్రాక్టికల్ అనుభవంలో అంతర్నిర్మిత భాగాన్ని కలిగి ఉంటుంది. ఇప్పటివరకు, 31 రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాల నుండి మొత్తం 512 డిఎస్‌డిపిలు వచ్చాయి. డిఎస్‌డిపిలు ఉపాధి అవకాశాలు మరియు నైపుణ్యానికి డిమాండ్ ఉన్న రంగాలను గుర్తిస్తాయి.

గరిబ్ కళ్యాణ్ రోజ్‌గర్ అభియాన్ (జికెఆర్ఎ) కింద గుర్తించిన వలస కార్మికుల నైపుణ్య శిక్షణ అవసరాన్ని పరిష్కరించడానికి ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన (పిఎంకెవివై) కింద వలస కార్మికులకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలను సృష్టించడం కోసం జిల్లా నిర్దిష్ట డిమాండ్ ఆధారిత స్కిల్లింగ్‌ను ఎంఎస్‌డిఇ చేపట్టింది. అస్సాం, బీహార్, ఒడిశా, రాజస్థాన్, మధ్యప్రదేశ్ మరియు ఉత్తర ప్రదేశ్ వంటి 6 రాష్ట్రాల్లో 119 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమం కింద ఇప్పటివరకు శిక్షణ పొందిన వలస కార్మికుల సంఖ్య 70,823. శిక్షణ కోసం ఉద్యోగ పాత్రలను ఎన్నుకునేటప్పుడు స్థానిక / జిల్లా స్థాయిలో నియామకం / ఉద్యోగ అవకాశం, స్వయం ఉపాధికి తోడ్పడటానికి బ్యాంకు రుణాన్ని సులభతరం చేయడం మరియు స్థానిక శిక్షణా కేంద్రాలలో అందుబాటులో ఉన్న ఉద్యోగాలు వంటి అంశాలు పరిగణించబడ్డాయి.

డిఎస్‌సిలు అభివృద్ధి చేసిన డిఎస్‌డిపిలు స్థానిక ఆర్థిక వ్యవస్థలో ఉపాధికి అవకాశం ఉన్న రంగాలను గుర్తిస్తాయి. 15.01.2021 న ప్రారంభించిన పిఎంకెవివై 3.0 కింద, నైపుణ్య శిక్షణను డిమాండ్‌తో నడిపించారు. డిఎస్‌సిలు తమ జిల్లాకు సంబంధించిన ఉద్యోగ పాత్రలను గుర్తించాయి. దీర్ఘకాలంలో నైపుణ్యం ఉన్న అభ్యర్థులు అదే ప్రాంతంలో ఎక్కువ సంఖ్యలో ఉపాధి పొందుతారు.

ఈ సమాచారాన్ని కేంద్ర నైపుణ్య అభివృద్ధి, వ్యవస్థాపకత శాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ఈ రోజు లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో అందించారు.

## ఆసుపత్రి నుంచి విహెచ్ డిశ్చార్జ్

హైదరాబాద్ , జులై 20:అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు 24 రోజుల తర్వాత నిన్న డిశ్చార్జ్ అయ్యారు.తాను త్వరగా కోలుకోవాలని, తన ఆరోగ్యం కుదుటపడాలని కోరుతూ పూజలు చేసిన అభిమానులు, నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు వీహెచ్.

కాగా, అనారోగ్యం కారణంగా వీహెచ్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందిన సంగతి తెలిసిందే. పలువురు కాంగ్రెస్ నేతలు ఆయనను ఆస్పత్రిలో పరామర్శించారు. సోనియా గాంధీ సైతం వీహెచ్ ఆరోగ్యంపై ఆరా తీశారు. టీపీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన తర్వాత రేవంత్‌రెడ్డి ఇటీవల ఆసుపత్రిలో వీహెచ్‌ను కలిసి పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## హిమాయత్‌సాగర్‌కు భారీగా వరద.. 3 గేట్లు ఎత్తిన అధికారులు



హైదరాబాద్ , జులై 20:హైదరాబాద్ నగర శివారులోని హిమాయత్‌సాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో మంగళవారం సాయంత్రం అధికారులు మూడు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులను జలమండలి అప్రమత్తం చేసింది. హిమాయత్ సాగర్ పరివాహక ప్రాంత ప్రజలకు అధికారులు పలు సూచనలు చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ప్రస్తుతం సాగర్ ఇన్‌ఫ్లో 2,500 క్యూసెక్కులుగా ఉంది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 1763.50 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 1762.80 అడుగులుగా ఉంది.

# రాష్ట్రాలకు జీఎస్టీ పరిహారం బకాయిలు చెల్లింపు

న్యూఢిల్లీ, జులై 20:2020-21 మరియు 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో ప్రభుత్వం అన్ని జీఎస్టీ పరిహార బకాయిలను రాష్ట్రాలకు చెల్లించింది. ఈ రోజు లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంలో ఆర్థిక శాఖ సహాయ మంత్రి శ్రీ పంకజ్ చౌదరి ఈ విషయాన్ని వెల్లడించారు.

జీఎస్టీ (రాష్ట్రాలకు పరిహారం) చట్టం, 2017 లోని సెక్షన్ 8 కింద విధించే జీఎస్టీ పరిహార సెస్ జీఎస్టీ కాంపెన్సేషన్ ఫండ్ అని పిలిచే, గడువు తీరడానికి అవకాశం లేని, ఫండ్‌లోకి బదిలీ అవుతుంది. ఇది చట్టంలోని సెక్షన్ 10(1) లో ఇచ్చిన విధంగా పబ్లిక్ అకౌంట్ ఆఫ్ ఇండియాలో భాగంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ చట్టంలోని సెక్షన్ 10 (2) ప్రకారం పరిహార నిధి నుండి ఐదేళ్లపాటు జీఎస్టీని అమలు చేయడం వల్ల వచ్చే ఆదాయ నష్టానికి రాష్ట్రాలకు పరిహారం ఇస్తున్నారు. 2017-18, 2018-19, 2019-20 ఆర్థిక సంవత్సరాలకు జీఎస్టీ పరిహారం ఇప్పటికే రాష్ట్రాలకు చెల్లించారు.

మహమ్మారి ఆర్థిక ప్రభావంతో తక్కువ జీఎస్టీ వసూలు, అదే సమయంలో జీఎస్టీ పరిహార సెస్ తక్కువ వసూలు చేయడం వల్ల అధిక పరిహారం అవసరమని మంత్రి పేర్కొన్నారు. జీఎస్టీ పరిహారంపూర్తి పరిహార అవసరాన్ని తీర్చడానికి జిఎస్‌టి పరిహార నిధిలో ఉన్న మొత్తం సరిపోకపోవడంతో ఏప్రిల్ 20 నుంచి మార్చి 21 వరకు చెల్లించాల్సిన పరిహారాన్ని పాక్షికంగా తీర్చడానికి రూ. 91,000 కోట్లు అన్ని రాష్ట్రాలు / యుటిలకు విడుదల అయ్యాయి. ప్రతి రాష్ట్రానికి ఇంకా విడుదల చేయాల్సిన జీఎస్టీ పరిహారం వివరాలు కూడా మంత్రి తన లిఖిత పూర్వక సమాధానంలో పేర్కొన్నారు.

జిఎస్‌టి (రాష్ట్రాలకు పరిహారం) చట్టం, 2017 ప్రకారం జిఎస్‌టి అమలు చేయడం వల్ల వచ్చే ఆదాయ నష్టం కారణంగా కొన్ని రాష్ట్రాలు జిఎస్‌టి పరిహారం చెల్లించాలని కోరినట్లు మంత్రి తెలిపారు.

ఎఫ్ఆర్బిఎం పరిమితిని సవరించడం, వైద్య పరికరాల సేకరణకు అదనపు నిధి మరియు అధికార పంపిణీ మంజూరు వంటివి అదనంగా రాష్ట్రాల నుంచి సాధారణ అభ్యర్థన అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటువంటి వివిధ అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుంది. రాష్ట్రాలకు సాధ్యమైనంత సహాయం అందించడానికి కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి తెలిపారు.

రాష్ట్రాలకు జీఎస్టీ పరిహారం ఇస్తున్న విషయం 41, 42 వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశాల్లో చర్చించామని ఆయన చెప్పారు. తదనుగుణంగా, 20-21 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం పరిహార నిధిలో సరిపోని బ్యాలెన్స్ కారణంగా పరిహారాన్ని స్వల్పంగా విడుదల చేయడం అయింది. దీని వల్ల వనరుల అంతరాన్ని తీర్చడానికి రాష్ట్రాలకు సహాయపడటానికి ప్రత్యేక విండో కింద రూ.1.1 లక్షల కోట్లు కేంద్రం రుణం తెచ్చి, రాష్ట్రాలకు బ్యాక్-టు-బ్యాక్ రుణంగా ఇచ్చింది అని కేంద్ర మంత్రి తెలిపారు.

# దేశంలో కోవిడ్ మరణాలు లక్షల్లో కాదు.. మిలియన్లలో..!

న్యూఢిల్లీ, జులై 20:కరోనా ప్రపంచదేశాలతో పాటు మనదేశంలో వినాశం సృష్టించిన సంగతి తెలిసిందే.. ఈ మహమ్మారి దాటికి మనదేశంలో? ఇప్పటివరకు 4.14 లక్షల మంది మృత్యువాత వడ్డారు. ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిని రికార్డులు ఇవి? అయితే కరోనాతో మృతి చెందిన వారి సంఖ్య అంతకుమించి రెట్టింపు స్థాయిలో ఉంటుందని ముందునుంచి నిపుణులు చెబుతూనే ఉన్నారు.

అయితే ఆ వాదనకు బలం చేకూరుస్తు తాజాగా విడుదలయిన ఓ సర్వే సంచలనంగా మారింది. ఆ సర్వే అంచనాల ప్రకారం దేశంలో ఇప్పటివరకు కరోనాతో మరణించిన వారి సంఖ్య 40 లక్షలు ఉండవచ్చిని బాంబు పేల్చారు.. దేశ మాజీ ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్‌తోపాటు సెంటర్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్, హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన ఇద్దరు రీసెర్చర్లు చేశారు.

వారి సర్వే ప్రకారం దేశంలో 2020 జనవరి నుంచి 2021 జూన్ మధ్య కరోనా కారణంగా చనిపోయిన వాళ్ల సంఖ్య 30 లక్షల నుంచి 47 లక్షల మధ్య ఉండొచ్చుని. అధికారిక లెక్కల కంటే అసలు మరణాల రేటు ఎంత ఎక్కువగా ఉందో దీనిని బట్టి తెలుస్తోందని ఆ సర్వే చెబుతోంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంతటి పెను విషాదాన్ని ఇండియా గతంలో ఎప్పుడూ చూడలేదనీ ఈ సర్వే తేల్చింది. పేషెంట్లతో హాస్పిటల్స్ కిక్కిరిసిపోవడం లేదా సరైన సమయానికి వైద్యం అందకపోవడం వల్ల చనిపోయిన వారిని లెక్కలోకి తీసుకోకపోవడం వల్ల ఈ భారీ తేడా వచ్చి ఉండొచ్చుని ఈ సర్వే అంచనా వేసింది. కొవిడ్ మరణాలు లక్షల్లో కాదు.. మిలియన్లలో ఉన్నాయి. దేశ విభజన తర్వాత ఇదే అతిపెద్ద విషాదం అని ఆ రిపోర్ట్ స్పష్టం చేసింది. 1947లో దేశ విభజన సందర్భంగా హిందూ, ముస్లింల మధ్య జరిగిన ఘర్షణల్లో పది లక్షల మందికిపైగా మృత్యువాత పడ్డారు.

అన్ని రకాల మరణాలను పరిగణనలోకి తీసుకొని, దానిని గతేడాది మరణాలతో పోల్చి ఈ లెక్క తేల్చినట్లు రీసెర్చర్లు చెప్పారు. అయితే తాము సర్వే చేసిన ఈ ఏడు రాష్ట్రాల్లోని పరిస్థితే మిగతా రాష్ట్రాల్లోనూ ఉంటుందని చెప్పలేమని వాళ్లు తెలిపారు. దేశంలో అర్బన్ ప్రాంతాలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాలు ఉన్న రాష్ట్రాల్లో వైరస్ ప్రభావం తక్కువగా ఉండటమే దీనికి కారణమని చెప్పారు. ఇతర దేశాలు కూడా కొవిడ్ మరణాల లెక్క తప్పినా.. ఇండియాలో మాత్రం ఆ తేడా చాలా ఎక్కువగా ఉన్నట్లు ఈ సర్వే తేల్చింది.

# ఓట్ల కోసమే ఈటెల దిగజారుడు వ్యాఖ్యలు: మంత్రి గంగుల




కరీంనగర్ జులై 20(నేటినిజం ప్రతినిధి): మాజీ మంత్రి ఈటెలపై మంత్రి గంగుల కమలాకర్‌రెడ్డి మరోసారి తీవ్రవ్యాఖ్యలు చేశారు. ఈటెలను హత్య చేయాలని ప్రయత్నిస్తున్న మంత్రి పేరు బయటపెట్టాలని గంగుల డిమాండ్ చేశారు. ఓట్ల కోసమే ఈటెల ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈటెలతో తమకు రాజకీయ వైరమే తప్ప వ్యక్తిగత కక్ష లేదని మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. తెలంగాణలో భౌతిక దాడులు, హత్యల సంస్కృతి లేదన్నారు. ఈటెల ప్రాణాలకు ఎలాంటి భయం లేదని, ఆయన నిండు నూరేళ్ళు బతకాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు.

అయితే తన ప్రాణాలకు ముప్పు ఉందని ఈటెల చేసిన వ్యాఖ్యలపై విచారణ జరిపించాలని డీజీపీ కోరుతున్నట్లు మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఈటెల ఆయన మద్దతుదారులతోనే దాడి చేయించుకుని ప్రభుత్వంపై నెట్టివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. మాజీ మావోయిస్టు ఏ మంత్రి పేరు చెప్పాడో ఈటెల బయట పెట్టాలని మంత్రి గంగుల డిమాండ్ చేశారు. విచారణలో తన పేరు ఉంటే రాజకీయాల నుంచి తప్పుకుంటానని? ఒకవేళ ఈటెల వ్యాఖ్యల్లో నిజం లేకుంటే ఆయన రాజకీయాల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.

# వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలి

రాజన్న సిరిసిల్ల, జులై 20: (నేటినిజం ప్రతినిధి): జిల్లాలో నూతనంగా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు స్థాపించేలా ప్రోత్సహించాలి. పరిశ్రమల స్థాపనకై దరఖాస్తు చేసుకున్న వారికి అనుమతులు టీఎస్ ఐ-పాస్ నిబంధనలకు లోబడి సకాలంలో మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

మంగళవారం కలెక్టర్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించి, పరిశ్రమలకు అనుమతుల మంజూరు, తదితర అంశాలపై కమిటీ సభ్యులతో కలిసి చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరానికి 11.09 కోట్ల పెట్టుబడితో 54 పరిశ్రమలను స్థాపించడానికి అనుమతులు మంజూరు చేయడం జరిగిందన్నారు. తద్వారా 569 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలని సూచించారు.అలాగే రవాణా వాహనాలకు సంబంధించి పారిశ్రామిక రాయితీ పథకం ద్వారా కొనుగోలు చేసిన 57 మంది ఎస్సీ అభ్యర్థులకు 157.62 లక్షల రూపాయలు, 34 మంది ఎస్టీ అభ్యర్థులకు 93.22 లక్షల రూపాయలను మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఉపేందర్ రావు, లీడ్ బ్యాంక్ అధికారి రంగారెడ్డి, రాష్ట్ర ఆర్థిక సంస్థ అధికారి చంద్రవికాస్, ఎస్సీ కార్పోరేషన్ కార్యనిర్వాహణ సంచాలకులు డా.వినోద్ కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి అన్సార్, సెస్ డీఈఈ రఘుపతి, గిరిజన సంక్షేమ అధికారిని శైలజ, కాలుష్య నియంత్రణ బోర్డ్ అధికారి సుభాష్, దళిత పరిశ్రమల సమాఖ్య జిల్లా ప్రతినిధి మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.



# సీఎం కేసీఆర్ చొరవతోనే గ్రామాల అభివృద్ధి

వికారాబాద్, జులై 20: సీఎం కేసీఆర్ చొరవతోనే మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధి చెందుతున్నాయని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తెలిపారు. మంగళవారం వికారాబాద్ మండల పరిధిలోని కొటాలగూడ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామానికి ప్రధాన సమస్య అయిన రోడ్డు సమస్యను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నిధులు రాగానే ప్రాధాన్యత క్రమంలో పనులు చేసి సమస్యలు పరిష్కారం చేస్తామని వివరించారు.

గత ప్రభుత్వాల హయాంలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోక కుంటుపడిపోయాయని పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రామాల అభివృద్ధికి జనాభాను బట్టి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు నేరుగా గ్రామ పంచాయతీకే అందిస్తున్నారన్నారు.

ప్రధాన సమస్యలను గుర్తించి గ్రామ సంఘం ద్వారా తీర్మానం చేసి ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ నీరు ఇంటింటికి సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహించవద్దని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలను సరి చేసి ప్రమాదాలు జరుగకముందే సమస్య పరిష్కారం కావాలని విద్యుత్ అధికారులు సూచించారు.



కార్యక్రమంలో ఎంపీపీ చంద్రకళ, జడ్పీటీసీ ప్రమోదిని, స్థానిక సర్పంచ్ రాములునాయక్, పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కమాల్‌రెడ్డి, ఎంపీడీవో సుభాషిణి, మండల పార్టీ అధ్యక్షుడు పురుషోత్తం పాల్గొన్నారు.

# అలసత్వం వద్దు..కరోనా జాగ్రత్తలు తప్పనిసరి

అమరావతి, జులై 20:ఏపీలో కరోనా తగ్గుముఖం పడుతోంది. పాజిటివ్ కేసులు రోజురోజుకూ గణనీయంగా తగ్గుతున్నాయి. అయితే ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించకూడదని ప్రభుత్వం మరో వారం పాటు నైట్ కర్ఫ్యూను పొడిగించింది. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయి. కోవిడ్ నివారణ, వ్యాక్సినేషన్‌పై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. సమర్థ నిర్వహణ ద్వారా ఎక్కువ మందికి వ్యాక్సినేషన్ ఇవ్వగలిగామని సీఎం అన్నారు. థర్డ్‌వేవ్ వస్తే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. ఇక ఏపీలో నిన్న1628 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్త కేసులు సంఖ్య 19,41,724కు పెరిగాయి. తాజాగా 2,744 మంది బాధితులు కోలుకోగా.. ఇప్పటి వరకు 19,5,000 మంది డిశ్చార్జి అయ్యారు. వైరస్ ప్రభావంతో 22 మంది మృత్యువాతపడగా.. మొత్తం మృతుల సంఖ్య 13,154కు చేరింది. ప్రస్తుతం రాష్ట్రంలో 23,570 యాక్టివ్ కేసులున్నాయి.

## పీవీ సింధుకు రెండు ఎకరాల భూమి కేటాయించిన ఏపీ సర్కారు



అమరావతి, జులై 20:ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధుకు బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటు కోసం ఏపీ ప్రభుత్వం విశాఖ నగరంలోని తోటగరువులో రెండు ఎకరాల స్థలం కేటాయించింది. దీనికి సంబంధించిన జీవో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసింది. దీని ప్రకారం విశాఖ రూరల్ (చినగదిలి) మండల పరిధిలో 73/11, 83/5,6 సర్వే నంబర్లలో 2 ఎకరాల స్థలం కేటాయించినట్లు తహసీల్దార్ ఆర్.నర్సింహమూర్తి తెలిపారు.

కాగా ఈ స్థలానికి మండల సర్వేయర్‌తో ఇప్పటికే సర్వే నిర్వహించామని తహసీల్దార్ చెప్పారు. పీవీ సింధు నెలకొల్పే అకాడమీకి రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో స్థలం కేటాయించడం పట్ల నగర వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అకాడమీ ఏర్పాటుతో నగరం నుంచి క్రీడాకారులు తయారయ్యేందుకు మంచి అవకాశం కలుగుతుందన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## హైదరాబాద్‌లో రేపు ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ , జులై 20:బక్రీద్ పండగ సందర్భంగా బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మీరాలం ట్యాంక్ ఈద్గా, హాకీ గ్రౌండ్, మాసబ్ ట్యాంక్, లంగర్ హౌస్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 11:30 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు, ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని సీపీ తెలిపారు.

**వివిధ ప్రాంతాలలో ట్రాఫిక్ ఆంక్షల వివరాలు:**

-ఈద్గాకు ప్రార్థనల కోసం వచ్చే వారు పురానాపూల్, కామాటిపురా, కిషన్‌బాగ్, బహదూర్‌పురా ఎక్స్ రోడ్డు మీదుగా ఉదయం 8 నుంచి 11.30 గంటల మధ్యలో ఈ రూట్లలో రావాలని సూచించారు. ఈ వాహనాలను జూపార్కు ప్రాంతంలో పార్కు చేయాలి.

-శివరాంపల్లి వైపు నుంచి ప్రార్థనల కోసం వచ్చే అన్ని వాహనాలకు దానమ్మ హాట్స్ రోడ్డు నుంచి ఉదయం 8 గంటల నుంచి 11:30 గంటల వరకు అనుమతిస్తారు. ఈ సమయంలో సాధారణ ట్రాఫిక్‌ను ఈద్గా వైపు అనుమతించరు. దానమ్మ క్రాస్‌రోడ్స్ నుంచి శాస్త్రిపురం, ఎన్ఎస్‌కుంట రూట్‌లలో వెళ్లాలి. యూసుఫ్ పార్కింగ్, మజార్ పార్కింగ్, జయేశ్ పార్కింగ్, మోడ్రన్ సా మిల్ పార్కింగ్ ఈద్గా ఎదుట ఉన్న ప్రధాన రోడ్డు, మిర్ అలామ్ ఫిల్టర్ బెడ్, యాదవ్ పార్కింగ్‌లలో వాహనాలు పార్కు చేయాలి.

-కాలాపత్తర్ నుంచి ఈద్గాకు వచ్చే వాహనాలు కాలాపత్తర్ ఠాణా వైపు ఉదయం 8 నుంచి 11.30గంటల వరకు అనుమతిస్తారు. సాధారణ వాహనాలను మోచీ కాలనీ, బహదూర్‌పురా వైపు మళ్లిస్తారు. ఈ రూట్‌లో వచ్చే వాహనాలు భయ్యా పార్కింగ్, మోడ్రన్ పెట్రోల్ బంక్, బీఎన్‌కే కాలనీల్లో పార్కు చేయాలి.

-ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు పురానాపూల్ నుంచి బహదూర్‌పురా వైపు వెళ్లే భారీ వాహనాలను జియాగూడ, సిటీ కాలేజీ వైపు మళ్లిస్తారు.

-ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు శంషాబాద్, రాజేంద్రనగర్ వైపు నుంచి బహదూర్‌పురా వైపు వచ్చే వాహనాలను ఆరాంఘర్ జంక్షన్ వద్ద నుంచి మళ్లిస్తారు.

## భారత్‌తో సంబంధాలు కోరుకుంటున్నాం: నేపాల్ ప్రధాని దూబా

ఖాట్మండు, జులై 20:: భారతదేశం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కలిసి పనిచేసేందుకు సిద్ధమని నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దూబా చెప్పారు. తద్వారా భారత్‌తో నేపాల్ సంబంధాలు మరింత బలపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. భారత్‌తో కలిసి పనిచేయడం ద్వారా ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధాన్ని కూడా బలోపేతం చేయవచ్చునన్నారు. నేపాల్ ప్రధానిగా దూబా ఎన్నికైన సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ అభినందన సందేశం పంపారు. దీనికి ప్రతిస్పందనగా దూబా సోషల్ మీడియాలో తన ఉద్దేశాన్ని వ్యక్తం చేశారు.

షేర్ బహదూర్ దూబా వయసు 75 సంవత్సరాలు. దూబాను భారత అనుకూల నేపాలీ నాయకుడిగా పరిగణిస్తారు. నేపాల్‌లో రాజ్యాంగ, రాజకీయ సంక్షోభం దృష్ట్యా దూబాను ప్రధానిగా నియమించాలని ఆ దేశ సుప్రీంకోర్టు ఆదేశించింది. దాంతో దూబా ఈ నెల 13 న ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. రెండు రోజుల క్రితం పార్లమెంటులో జరిగిన బలనిరూపణలో దూబా 165 ఓట్లలో 83 గెలుచుకున్నారు.

ప్రధానిగా బలం నిరూపించుకోగానే భారత ప్రధాని మోదీ ఆదివారం రాత్రి దూబాకు అభినందన సందేశం పంపారు. దానికి దూబా వెంటనే సమాధానం ఇచ్చారు. వామపక్ష సంకీర్ణ ప్రభుత్వానికి అధిపతిగా ఉన్న ప్రధాని కేపీ శర్మ ఓలి హయాంలో భారత్-నేపాల్ సంబంధాలు దెబ్బతిన్నాయి. సరిహద్దు వివాదాలు, దేశ భౌగోళిక పటం వివాదాలు, సరిహద్దులోని భద్రతా దళాల మధ్య అప్పుడప్పుడు వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. నూతన ప్రధానిగా ఎంపికైన దూబా భారత్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధమని పేర్కొనడంతో.. రానున్న రోజుల్లో రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడుతాయని నిపుణులు భావిస్తున్నారు.

## ఒకే వ్యక్తిలో ఒకేసారి రెండు కరోనా వేరియంట్లు

హైదరాబాద్ , జులై 20:దేశంలోని తొలిసారిగా ఓ వ్యక్తికి ఒకేసారి రెండు కరోనా వేరియంట్లు సోకిన ఘటన అసోంలో వెలుగు చూసింది. దిబ్రూగఢ్‌లోని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్)కి చెందిన రీజనల్ మెడికల్ రీసెర్చ్ సెంటర్ (ఆర్ఎంఆర్సీ)లో పరీక్ష చేయించుకున్న ఓ వైద్యురాలికి రెండు వేరియంట్లు ఒకేసారి సోకినట్టు గుర్తించారు.వైద్యురాలు వ్యాక్సిన్ రెండు డోసులూ వేసుకున్నప్పటికీ.. ఆల్ఫా, డెల్టా రకాల కరోనా సోకిందని ఆర్ఎంఆర్సీ పేర్కొంది. అయితే స్వల్ప లక్షణాలతో ఇబ్బందిపడిన ఆమె.. ఆసుపత్రిలో చేరకుండానే కోలుకున్నారని తెలిపింది. రెండు వేరియంట్లు ఒకేసారి సోకిన ఘటనలను 'డబుల్ ఇన్ ఫెక్షన్' అంటారని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బి.జె. బోర్కకోటీ చెప్పారు. ఓ వ్యక్తికి ఏదైనా వేరియంట్ సోకిన రెండు మూడు రోజుల్లో కానీ, లేదా ప్రతిరక్షకాలు ఉత్పత్తి కావడానికి ముందుగా కానీ ఇలా మరో వేరియంట్ కూడా సోకే అవకాశం ఉంటుందన్నారు. మే తొలి వారంలోనే ఈ కేసు నమోదైనట్టు అధికారులు చెబుతున్నారు. వైద్యురాలి భర్తకు ఆల్ఫా వేరియంట్ సోకినట్టు తేల్చారు. ఇలాంటి డబుల్ ఇన్ ఫెక్షన్ కేసులు చాలా అరుదుగా నమోదవుతాయని వైద్యులు పేర్కొన్నారు

# కొవిడ్ నిబంధనలతో బక్రీద్ ప్రార్థనలు : డిఐజి రంగనాధ్



నల్లగొండ, జులై 20: బక్రీద్ పండుగ వేడుకలు, ఈద్గాల వద్ద నిర్వహించే ప్రార్ధనలు కొవిడ్ నిబంధనలకు లోబడి నిర్వహించేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని డిఐజి ఏ.వి. రంగనాథ్ చెప్పారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద బక్రీద్ సందర్భంగా చేసిన ఏర్పాట్లను ఆయన ముస్లిం మత పెద్దలు, పోలీస్ అధికారులు, ఈద్గా కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈద్గా వద్ద చేస్తున్న ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన ఈద్గా కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో బక్రీద్ పర్వదిన సందర్భంగా అన్ని ఈద్గాల వద్ద అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యంగా కొవిడ్ నేపథ్యంలో విధిగా మాస్కులు ధరించడం, ఈద్గాల పరిసరాలను సానిటైజ్ చేయడం లాంటి చర్యలు తీసుకుంటామని చెప్పారు. నల్లగొండ జిల్లా హిందు, ముస్లిం పండుగలను ఐకమత్యంగా నిర్వహించుకుంటూ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నదని గుర్తు చేశారు. శాంతియుత వాతావరణంలో జిల్లాలో బక్రీద్ పండుగ జరుపుకోవాలని ఆయన ప్రజలను కోరారు. ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునే బక్రీద్ పండుగ ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

డిఐజి వెంట హఫీజ్ ఖాన్, డాక్టర్ ఏ.కె.ఖాన్, మౌలానా ఇసాముద్దీన్, జియావుద్దీన్, షబ్బీర్, ఖాజీముల్లా, బషీరుద్దీన్, మూర్తుజా, వహీద్, మోయిన్, ఎస్.బి. డీఎస్పీ రమణా రెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వర్ రెడ్డి, నల్లగొండ వన్ టౌన్ సీఐ బాలగోపాల్, ట్రాఫిక్ సీఐ అనిల్ కుమార్, ఈద్గా కమిటీ సభ్యులు తదితరులున్నారు.

## మహాలక్ష్మి ఆలయంలో అఖండ భజన..



రాజన్న సిరిసిల్ల, జులై 20: (నేటినిజం ప్రతినిధి): తొలి ఏకాదశి పండగను పురస్కరించుకొని చందుర్తి మండల కేంద్రంలో

శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో మంగళవారం సాదు సజ్జన భక్తమండలి ఆద్వర్యంలో అఖండ భజన కార్యక్రమాన్ని నిర్వహించారు, ప్రతి సంవత్సరం మహాలక్ష్మి ఆలయం లో అఖండ భజన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది, సకాలంలో వర్షాల కురిసి పాడి పంటలు పండాలని, కరువు కాటకాలు తొలగిపోవాలని ఈ భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు,గత 17 సంవత్సరాల నుండి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు అఖండభజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు,ఈ అఖండ భజన కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఆది శ్రీనివాస్, బిజెపి జిల్లా అధ్యక్షులు ప్రతాప రామ కృష్ణ , మాజీ జెడ్పీ చైర్పర్సన్ తుల ఉమ, రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నాల శ్రీనివాసరావు, సింగిల్విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, మర్రిగడ్డ సర్పంచ్ నేతికుంట జలపతి,నాయకులు అల్లాడి రమేష్, పులిసత్యం గౌడ్, గొట్టె ప్రభాకర్, చింతపంటిరామస్వామి, సిరికొండ కొండ శ్రీనివాస్, సిర్రం తిరుపతి, మార్త సత్తయ్య, ఏంజాల శ్రీనివాస్, లింగాల మల్లయ్య, తిరుపతి రావు,డిష్ రవి, రాజు తదితరులు పాల్గొన్నారు, మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమైన అఖండ భజన కార్యక్రమం బుధవారం ఉదయం 9 గంటల తో ముగుస్తుందని సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్ తెలిపారు,

## చెర్వుగట్టు దేవాలయంలో ఎమ్మెల్యే చిరుమర్తి పూజలు

నల్లగొండ,జులై 20:: తొలి ఏకాదశి సందర్భంగా నార్కట్పల్లి మండలంలోని చెర్వుగట్టు దేవాలయంలో శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామిని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య దర్శించు కున్నారు. స్వామి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్చకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## రాష్ట్రంలో మళ్లీ మొదలయిన లాక్ డౌన్..

హైదరాబాద్ , జులై 20:తెలంగాణలో కరోనా కేసులు తగ్గుముఖం పట్టాయి..దీంతో ప్రభుత్వం ఆంక్షలను సడలించింది. దీంతో వ్యాపారాలు, మాల్స్, కాంప్లెక్స్‌లు తెరుచుకుంటున్నాయి. అయితే కొందరు మాత్రం ఇప్పటికీ ప్రజలు మాస్క్ లు లేకుండా బయటికి రాకూడని అధికారులు చెప్తున్నారు. ఇక మళ్లీ థర్డ్ వేవ్ మొదలుకానుందని నిపుణులు హెచ్చరిస్తుంటడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలోనే మరోసారి రాష్ట్రంలో లాక్‌డౌన్‌లు మొదలయ్యాయి. తాజాగా జగిత్యాల జిల్లాలో లాక్‌డౌన్ మొదలయ్యింది. వెల్గటూర్ మండలం ఎండపల్లిలో గత రెండు రోజుల క్రితం కరోనాతో ఒకరు మృతి చెందడంతో పాటు.. కరోనా కేసుల సంఖ్య 12కు పెరిగింది. దీంతో అప్రమత్తమైన గ్రామ పంచాయితీ మరోసారి లాక్ డౌన్ అమలుచేస్తున్నట్లు ప్రకటించింది.

ఎండపల్లిలో గ్రామంలో జూలై 19వ తేదీ నుంచి ఆగస్ట్ 1 వరకు పది రోజుల పాటు లాక్డౌన్ విధిస్తూ గ్రామపంచాయతీ తీర్మానం చేసింది. ఉదయం ఏడు గంటల నుంచి 9 గంటల వరకు మాత్రమే దుకాణాలు తెరిచి ఉంచాలని. ఆ తర్వాత మూసేయాలంటూ తీర్మానంలో పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన దుకాణ యజమానులకు 5 వేల రూపాయల జరిమాన విధిస్తామని తెలిపారు. అలాగే గుంపులుగా తిరిగినా, మాస్క్ ధరించకపోయినా వెయ్యి రూపాయల జరిమానా విధించాలని నిర్ణయించారు. ఏఎన్ఎంలకు కరోనా రోగుల సమాచారం అందించిన తర్వాతే..ఆర్ఎంపీలు వైద్యం చేయాలని తీర్మానించారు. సామాజిక దూరం పాటించాలని.. గుంపులుగా తిరగొద్దని.. మాస్క్ ధరించాలంటూ అవగాహన కల్పించేలా గ్రామంలో వాల్ పోస్టర్స్ అతికించారు.

## మంత్రి పువ్వాడను కలిసిన నూతన కలెక్టర్

ఖమ్మం, జులై 20: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వి.పి. గౌతమ్ గురువారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌ను ఖమ్మం ఎస ఎస్‌పీ గెస్ట్ హౌస్ ల మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందజేశారు. బాధ్యతలు చేపట్టిన గౌతమ్‌కు మంత్రి పువ్వాడ అభినందనలు తెలిపారు. అనంతరం జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మేయర్ పునుకొల్లు నీరజ, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణర, ఎమ్మెల్యే రాములు నాయక్, డిప్యూటీ మేయర్ ఫాతీమా జోహరా, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ తదతరులు అభినందనలు తెలిపారు.

## సిరిసిల్ల నివాసికి చిరంజీవి ఆక్సిజన్ బ్యాంక్ ద్వారా కాన్సంట్రేటర్ అందజేయుట




రాజన్న సిరిసిల్ల, జులై 20: (నేటినిజం ప్రతినిధి): గత 50 యాభై రోజులనుండి రాజన్న సిరిసిల్ల జిల్లాలో చిరంజీవి ఆక్సిజన్ బ్యాంక్ ఉచిత సేవలో భాగంగా ఈ రోజు సిరిసిల్ల కు చెందిన సుధాకర్ శర్మ అనే వ్యక్తికి బైపాస్ సర్జరీ జరుగగా ఆక్సిజన్ అవసరం ఉండగా సిరిసిల్ల నివాసి చరణ్ ను సంప్రదించగా వేములవాడ లో చిరంజీవి అభిమానులు మారం ప్రవీణ్ కుమార్ దురశెట్టి అరుణ్ తేజచారిలకుసమాచారామివగా వేములవాడ మున్నూరు కాపు సత్రం లో సుధాకర్ శర్మ కుటుంభసభ్యులకు కాన్సంట్రేటర్ మీటర్ ను అందించారు ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ ఇంతటి గొప్ప సేవా కార్యక్రమం లో భాగస్వామ్యం చేసిన మా ఆరాధ్య దైవం మెగాస్టార్ చిరంజీవి గారికి మరియు వేములవాడ లో అన్ని విధాలుగా అభిమానులకు అండగా ఉండి సహకారం చేస్తున్న డాక్టర్ కొండ దేవయ్య కి కృతజ్ఞతలు తెలిపారు.

## కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీపాద్ నాయక్

న్యూఢిల్లీ, జులై 20: కేంద్ర పర్యాటక శాఖ సహాయ మంత్రిగా శ్రీపాద్ నాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో ప్రధాని నరేంద్ర మోదీ ఆయనకు పర్యాటక, ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖల బాధ్యతలు అప్పగించారు.

2014లో కొత్తగా ఆయుష్ మంత్రిత్వశాఖ ఏర్పాటైన నాటి నుంచి ఆయన మంత్రిత్వశాఖ బాధ్యతలు నిర్వర్తిస్తూ వచ్చారు. ఈ నెల ప్రధాని ప్రధాని నరేంద్ర మోదీ మంత్రివర్గ విస్తరణ చేపట్టగా.. ఆరోగ్యశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ, న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజీజు, విద్యాశాఖమంత్రిగా ధర్మేంద్ర ప్రసాద్, పౌర విమానయాన శాఖ మంత్రిగా జ్యోతిరాధిత్య సింధియాకు బాధ్యతలు అప్పగించారు. బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా కొంత మంది మంత్రులను తొలగించగా.. కొత్తవారిని కేబినెట్‌లోకి తీసుకున్న విషయం తెలిసిందే.

## బాధ్యతలు స్వీకరించిన ఆ మూడు జిల్లాల కలెక్టర్లు

హైదరాబాద్ , జులై 20: కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు నూతనంగా ప్రభుత్వం నియమించిన కలెక్టర్లు మంగళవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు.

కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా ఆర్వీ కర్ణన్, ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా వీపీ గౌతమ్, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌గా అభిలాష అభినవ్ బాధ్యతలు స్వీకరించారు.

కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లను బదిలీ చేస్తూ నిన్న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఖమ్మం జిల్లా కలెక్టర్ కర్ణన్‌ను కరీంనగర్‌కు బదిలీ చేసింది. కరీంనగర్ కలెక్టర్ కే శశాంకను జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. మహబూబాబాద్ కలెక్టర్ గౌతమ్‌ను ఖమ్మంకు బదిలీ చేసింది. మహబూబాబాద్ అడిషనల్ కలెక్టర్ అభిలాషకు జిల్లా కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది.

## బాలల పరిరక్షణకే బాల రక్షక భవన్.

### - రాష్ట్ర పౌర సరఫరాలు బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్



రాజన్న సిరిసిల్ల, జులై 20: (నేటినిజం ప్రతినిధి): బాలల పరిరక్షణకై అందించే అన్ని సేవలు ఒకే చోట లభించుటకె బాల రక్షక భవన్ ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర పౌర సరఫరాల, బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు .మంగళవారం బాల రక్షక భవన్ ను మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాలల పరిరక్షణకై అందించే అన్ని సేవలు ఒకే గొడుగు కిందకు తేవాలనే ఉద్దేశంతో బాల రక్షక భవన్ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు .తెలిసీ తెలియని వయసులో చేసిన తప్పులను సరిదిద్ద వారు పెద్దయ్యాక సక్రమ జీవనము కొనసాగేలా చేయుటకు బాల రక్షక భవన్ ఎంతో తోడ్పడుతుందని అన్నారు .

బాల రక్షక భవన్ లో బాలబాలికలకు న్యాయ సహాయం అందుతుందని తెలిపారు .రక్షణ లేని పిల్లలకు రక్షణ కల్పించబడుతుంది అన్నారు .ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్ .వి కర్ణన్, నగరపాలక సంస్థ మేయర్ వై సునీల్ రావు, ఎస్సి. పి సి ఆర్ మెంబర్ శోభారాణి , డి ఎల్ ఎస్ ఎ సుజయ్, సీడబ్ల్యూసీ చైర్పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి శారద, కోఆర్డినేటర్ సరస్వతి, ఏ. సి.పి మదన్ లాల్, కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఎలుకలు కొరికిన నోట్లను ఆర్బీఐకీ పంపిన అధికారులు..

హైదరాబాద్ , జులై 20:తెలంగాణ రాష్ట్రంలోని మహబూబాబాద్ జిల్లా వేమునూరు పంచాయతీ పరిధిలోని ఇందిరానగర్ తండాకు వాసి భూక్య రెడ్యా అనే రైతు కు చెందిన రెండు లక్షల రూపాయలను ఎలుకలు కొరికిన వార్త సంచలనంగా మారిన సంగతి అందరికి తెలిసిందే. కడుపులో కణితి ఆపరేషన్ కోసం బీరువాలో దారుచుకున్న రూ.2 లక్షల కరెన్సీ నోట్లను ఎలుకలు ముక్కలు ముక్కలుగా కొరికేశాయి. అయితే ఇప్పుడు ఆ నోట్లను అధికారులు ఆర్‌బీఐకి పంపించారు. కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు సోమవారం ఆ కరెన్సీ నోట్లను హైదరాబాద్‌లోని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కార్యాలయానికి పంపి నట్లు తహసీల్దార్ రంజిత్‌కుమార్ తెలిపారు. రైతు భూక్యా రెడ్యాతో పాటు వీఆర్ఏ కత్తుల రాజశేఖర్‌ను హైదరాబాద్‌కు పంపించి ఎలుకలు కొరికిన కరెన్సీ నోట్లను ఆర్‌బీఐ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. తదుపరి ఆదేశాలు వచ్చాక మరిన్ని వివరాలు వెల్లడిస్తామన్నారు.

చికిత్స కోసం దాచుకున్న నగదును ఎలుకలు కొట్టడంతో తీవ్ర బాధలో ఏం చేయాలో దిక్కుతోచని రైతు రెడ్యాకు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అండగా నిలిచారు. రెడ్యాకు మంత్రి సత్యవతి ఫోన్ చేసి మాట్లాడారు. రెడ్యా దాచుకున్న డబ్బులను తిరిగి ఇప్పిస్తానని, ఆయన కోరుకున్న చోట మెరుగైన వైద్యం అందిస్తామని మంత్రి సత్యవతి రాథోడ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం ఉదయం ఎమ్మార్వో రంజిత్‌ని రైతు రెడ్యా దగ్గరకు పంపించి, ధైర్యం చెప్పారు.

# దేశంలోనే తొలిసారి.. హైదరాబాద్‌లో ట్రాన్స్‌జెండర్ క్లినిక్

హైదరాబాద్ , జులై 20:దేశంలోనే తొలిసారిగా రెండు ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌లను హైదరాబాద్‌లో నెలకొల్పారు. ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ యాక్ట్, 2019 ప్రకారం.. ప్రతి మెట్రో సిటీలో ట్రాన్స్ జెండర్ క్లినిక్ ఉండాలన్న నిబంధనకు లోబడి కేంద్ర ప్రభుత్వ ప్రణాళికల్లో భాగంగా హైదరాబాద్‌లో ఈ రెండు క్లినిక్‌లను ప్రారంభించారు. నగరంలోని ట్రాన్స్‌జెండర్లలో హెచ్ఐవీ ప్రాబల్యం ఉండటం, దాన్ని నిర్మూలించేందుకే హైదరాబాద్‌ను ప్రథమంగా ఎంపిక చేసుకున్నారని ట్రాన్స్ కార్యకర్త రచన ముద్రబోయిన తెలిపారు. హైదరాబాద్‌లోని ట్రాన్స్‌జెండర్ల కమ్యూనిటీలో హెచ్ఐవీ ప్రాబల్యం 6.47 శాతం ఉండగా, జాతీయ సరాసరి 3.13 శాతంగా ఉంది. అయితే 2030 నాటికి ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించాలన్న లక్ష్యంతో.. యూనైటెడ్ స్టేట్స్ ఏజెన్సీస్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ( జూఎఐ ), నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ( ఔంఆ ) పని చేస్తున్నాయి. హైదరాబాద్‌లో ప్రారంభించబడ్డ ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ క్లినిక్ సమర్ధవంతంగా పని చేస్తున్నాయని రచన పేర్కొన్నారు. హెచ్ఐవీ నిర్మూలనకు మాత్రమే కాకుండా, ఆంటీరిట్రోవైరల్ థెరపీ ( ఒఖీ ) చికిత్సలు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. నగరంలో తొలి క్లినిక్‌ను నారాయణగూడలో ఈ ఏడాది జనవరి 29న, రెండో క్లినిక్‌ను జీడిమెట్లలో జులై 11న ప్రారంభించారు. అయితే ఈ క్లినిక్స్‌లో కేవలం ట్రాన్స్‌జెండర్లకు చికిత్స అందించడమే కాకుండా.. హిజ్రా, ట్రాన్స్ మెన్, క్రాస్ డ్రెస్సర్స్, లింగ నిర్ధారణ కాని వారికి, జోగినీలు, శివశక్తులకు కూడా వైద్యం అందిస్తున్నారు. ఈ క్లినిక్‌లు పూర్తిగా ట్రాన్స్‌జెండర్లచే నడుస్తున్నాయి. దీని వల్ల స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందనే ఉద్దేశంతోనే ట్రాన్స్‌ను నియమించామని



పేర్కొన్నారు. డాక్టర్ ప్రాచీ, డాక్టర్ రుతు ఇద్దరూ ఎంబీబీఎస్ చదివారు. వీరిద్దరూ ట్రాన్స్‌జెండర్లే అని రచన ముద్రబోయిన తెలిపారు.

## ఏపీలో ప్రభుత్వ కార్యాలయాల పనివేళల పునరుద్ధరణ

అమరావతి, జులై 20: కరోనా కారణంగా మార్చిన ప్రభుత్వ కార్యాలయాల పనివేళలను పునరుద్ధరిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇవాళ ఉత్తర్వులు జారీ చేసింది. రేపటి నుంచి ఉదయం 10 గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కార్యాలయాలు పనిచేస్తాయని తెలిపింది. సచివాలయం, విభాగాధిపతులు, కార్పొరేషన్ల కార్యాలయాలకు ఇవే పనివేళలు వర్తిస్తాయని ఏపీ సర్కార్ స్పష్టం చేసింది. జిల్లా కార్యాలయాలకు ఆదివారం, రెండో శనివారం సెలవు ఉంటుందని వెల్లడించింది. సచివాలయం, విభాగాధిపతులు, కార్పొరేషన్ల కార్యాలయాలకు వారానికి రెండ్రోజులు సెలవులు ఉంటాయి. ఈ కార్యాలయాలు మరో ఏడాదిపాటు వారానికి ఐదురోజులే పనిచేస్తాయని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలో కరోనా ప్రభావం తగ్గడంతో ప్రభుత్వ కార్యాలయాల పనివేళలను పునరుద్ధరిస్తున్నట్లు ఉత్తర్వుల్లో వెల్లడించింది.

## గీతకార్మికునికి ప్రభుత్వం ఆదుకోవాలి .ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణ స్వామిగౌడ్



రాజన్న సిరిసిల్ల, జులై 20: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన గాలి పెల్లి అంజయ్య గత వారం రోజుల క్రితం ఆ గ్రామ శివారులో తాడిచెట్టు పై నుండి ప్రమాదవశాత్తు పడిపోవడంతో తీవ్ర గాయాలతో మంచానికే పరిమితమయ్యాడు . ఈ విషయం తెలుసుకున్న గ్రామ ఎంపిటిసి గాలి పెల్లి సువర్ణ స్వామి గౌడ్ గౌడ సంఘం అధ్యక్షులుకత్తి కనకయ్య గౌడ్ కుల పెద్దలు శ్రీనివాస్ గౌడ్, తిరుపతి గౌడ్, తదితరులు అంజయ్య ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు .రెక్కాడితే కాని డొక్కాడని అంజయ్య మంచానికే పరిమితం కావడంతో అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీటీసీగాలి పెల్లి సువర్ణ స్వామిగౌడ్ కోరారు

## అక్బర్ హుస్సేన్ జన్మదినం సందర్భంగా మొక్కలు నాటిన టిఆర్ఎస్ నాయకులు



రాజన్న సిరిసిల్ల, జులై 20: (నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఫార్మర్ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మంగళవారం నగరంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎండి. మాజిద్ అలీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

సీఎం కేసీఆర్, కేటీఆర్, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ వినోద్ కుమార్ లు అక్బర్ హుస్సేన్ కు ఆశీస్సులు అందజేశారు. అక్బర్ హుస్సేన్ ఆయుర్ ఆరోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఈకార్యక్రమంలో షాహ్బాజ్, శ్రీనివాస్, అజ్హర్, షోయబ్ తదితరులు ఉన్నారు.

## 67 శాతం మందిలో కరోనా యాంటీబాడీలు

న్యూఢిల్లీ, జులై 20: ఇండియా జనాభాలో మూడింట రెండు వంతుల మందిలో కరోనా యాంటీబాడీలు వృద్ధి చెందినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ మంగళవారం వెల్లడించింది. ఇంకా 40 కోట్ల మందికి ఈ వైరస్ ముప్పు పొంచి ఉన్నదని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా నాలుగో జాతీయ సెరో సర్వేను రిలీజ్ చేసింది. ఈ నాలుగో సర్వేలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) పిల్లలను కూడా చేర్చింది. దేశంలో 6-17 ఏళ్ల మధ్య వయసున్న పిల్లల్లో 50 శాతానికిపైగా ఈ కరోనా యాంటీబాడీలు వృద్ధి చెందినట్లు గుర్తించారు.

అత్యధికంగా 45 నుంచి 60 ఏళ్ల వయసున్న వాళ్లలో 77.6 శాతం మందికి, ఆ తర్వాత 60 ఏళ్లు పైబడిన వాళ్లలో 76.7 శాతం మందికి, 18-44 ఏళ్ల వయసు వాళ్లలో 66.7 శాతం మందిలో కరోనా యాంటీబాడీలు ఉన్నట్లు సెరో సర్వే తేల్చింది. ఈ సర్వేలో పిల్లలను రెండు గ్రూపులు విభజించారు. 6-9 ఏళ్లు, 10-17 ఏళ్లు. వీళ్లలో 6-9 గ్రూపులో 57.2 శాతం మందిలో, 10-17 వయసు వాళ్లలో 61.6 శాతం మందిలో యాంటీబాడీలు వృద్ధి చెందాయి.

## భార్యతో బలవంతంగా యాసిడ్ తాగించిన భర్త

మధ్యప్రదేశ్, జులై 20: మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో దారుణం జరిగింది. భార్యతో ఓ భర్త బలవంతంగా యాసిడ్ తాగించడంతో అంతర్గత అవయవాలు దెబ్బతినగా చికిత్స నిమిత్తం ఆమెను ఢిల్లీ తరలించారు. ఈ ఘటనలో నిందితుడిని ఇప్పటివరకూ అరెస్ట్ చేయలేదని ఢిల్లీ మహిళా కమిషన్ చీఫ్ స్వాతి మలివాల్ ట్వీట్ చేశారు.

ఈ ఘటనపై మధ్యప్రదేశ్‌లో ఎఫ్ఐఆర్ నమోదు కాగా బాధితురాలి స్టేట్‌మెంట్‌ను సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఎదుట నమోదు చేశారని ఆమె పేర్కొన్నారు. నిందితుడిని సత్వరమే అరెస్ట్ చేసేలా చొరవ చూపాలని మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ చౌహాన్‌కు స్వాతి మలివాల్ విజ్ఞప్తి చేశారు. ఇక యూపీలో వెలుగుచూసిన మరో ఘటనలో తన కోరికను తీర్చేందుకు నిరాకరించిన భార్య అక్కపై నిందితుడు యాసిడ్ పోశాడు.

## ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపింది జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే



రాజన్న సిరిసిల్ల, జులై 20: (నేటినిజం ప్రతినిధి): ముస్లిం సోదరులకు పవిత్ర బక్రీద్ పండుగ శుభాకాంక్షలు జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ బక్రీద్ పండుగ పవిత్రతకు , త్యాగానికి, ఐక్యతకు, నిదర్శనమని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కరోనా వ్యాధి నివారణకు విధించిన నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించి, ఈద్గాల వద్ద భౌతిక దూరం పాటించి ప్రార్థనలు చేసుకోవాలని సూచించారు. మరియు ముస్లిం సోదరులు పోలీసు వారి సలహాలు సూచనలు పాటించి పవిత్ర బక్రీద్ పండుగ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహలతో మధ్య జరుపుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.